బడ్జెట్ అదుర్స్

పోలవరం నిర్మాణానికి పూర్తి సానుకూలత





- కొవ్వూరు-భద్రాచలం, కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్లకు కదలిక
- ఆక్వా మేతలపై పన్నులు తగ్గింపు.. రొయ్యల సాగుకు మంచి రోజులు
- సడక్ యోజన కింద గ్రామీణ రోడ్ల అభివృద్ధి
- ఆరు శాతం సుంకం తగ్గింపు.. భారీగా తగ్గిన బంగారం ధరలు
- నిర్మలమ్మ బడ్జెట్‌పై కూటమి హర్షం
- వామపక్షాల పెదవి విరుపు

కేంద్ర బడ్జెట్‌లో అందరూ కోరుకున్నట్లే పోలవరం పూర్తి చేసే దిశగా విధాన ప్రకటన వెలువడింది. పట్టణ ప్రాంతాల్లో పక్కా గృహ నిర్మాణానికి వీలుగా నిధులు కేటాయించనున్నారు. జల జీవన్ మిషన్ కింద తాగు నీరు, 300 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందించేందుకు సమగ్ర ప్రణాళిక.. నిధుల కేటాయింపునకు సిద్ధమైంది. ఇంకో వైపు రైల్వే కోసం ప్రత్యేక ప్రకటన చేయకపోయినా ఏపీలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో అన్నీ పూర్తి చేస్తామంటూ భరోసా లభించింది. ఇప్పటికే రోడ్లు దారుణంగా దెబ్బ తినగా, సడక్ యోజన కింద గ్రామీణ రహదారులకు నిధులు కేటాయించను న్నారు. పార్లమెంట్‌లో మంగళవారం ఆర్థిక మంత్రి నిర్మలమ్మ బడ్జెట్‌పై ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని కూటమి శ్రేణులు సంతృప్తి వ్యక్తం చేయగా, వామపక్షాలు పెదవి విరిచాయి.

(ఏలూరు/భీమవరం/నరసాపురం-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పోలవరం పూర్తి చేయటానికి వీలుగా కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక ప్రస్తావన చేశారు. ఈ ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసేందుకు తమ సహకారం ఉంటుందంటూ ప్రకటించారు. గడిచిన ఐదేళ్లుగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి వీలుగా ఎటువంటి నిధులు కేటాయించలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగా, ప్రధాని మోదీ చొరవతో కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేకంగా ఈ సారి నిర్మాణం పూర్తి చేస్తామంటూ విధాన ప్రకటన చేయడం అందరిని సంతృప్తి పరిచేలా చేసింది. వాస్తవానికి ప్రాజెక్టు నిర్మాణానికి వీలుగా గడిచిన ఎన్నికల్లో గెలిచిన వెంటనే సీఎం చంద్రబాబుతో సహా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్‌తోపాటు రాష్ట్ర జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు అప్రమత్తమ య్యారు. కేంద్రంతో సంప్రదింపులు జరిపిన నేపథ్యంలో ప్రాజెక్టుకు తగినన్ని నిధులు కేటాయించాలంటూ డిమాండ్ చేస్తూ వచ్చారు. దీనికి తలొగ్గిన కేంద్రం బడ్జెట్‌లో ప్రత్యేకించి నిధులు ఎంత ఇస్తామో చెప్పకుండానే పూర్తి చేయడానికి సహకరిస్తామని సానుకూల ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో పోలవరం పనులు శరవేగంగా పుంజుకునేందుకే ఇప్పుడు అవకాశం చిక్కింది. గడిచిన ఐదేళ్లు పోలవరం ప్రాజెక్టు పూర్తిగా పడకేసిన నేపథ్యంలో ఇక ఈ ప్రాజెక్టు పట్టిదే అన్నట్టు రైతుల్లో అసంతృప్తి నెలకొంది. దీనిని కూటమి ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో పటాపంచలు చేస్తూనే వచ్చింది. ఆ దిశగానే కేంద్ర బడ్జెట్‌లోనూ ప్రాజెక్టును ప్రస్తావించటం సానుకూలతకు దారితీసింది.

రైల్వే పనులపైనా సానుకూలత



కొవ్వూరు-భద్రాచలం రైల్వే లైనుకు ఎంత మొత్తం కేటాయించింది బడ్జెట్‌లో ఇంకా స్పష్టత రాలేదు. కాని ఏపీలో ఉన్న రైల్వే పనులన్నిం టిని పూర్తి చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటిం చారు. దీన్ని బట్టి చూస్తే ఈ లైన్‌కు ఈసారి కేటాయింపులు ఘనంగానే ఉండబోతున్నాయని భావిస్తున్నారు. ఈ లైన్ నిర్మాణానికి ఎందరో ఆశలు పెంచుకున్నారు. గతంలో మాదిరిగా కాకుండా ఈ సారి ఎంపీలు శాఖల వారీగా పని విభజన చేసుకుని ఆ మేరకు కేంద్రంపై వత్తిడి తెచ్చేందుకు ముందుగానే వ్యూహాత్మకంగా కదిలారు. దీంతో ఈ పెండింగ్ పనులు అన్ని ఒకదాని వెంట మరొకటి ముందుకు సాగుతా యన్న ఆశ నెలకొంది. కేంద్ర వార్షిక బడ్జెట్‌లో ఏ లైన్‌కు ఎంత కేటాయిస్తున్నారనేది ఆర్థిక మంత్రి తన ప్రసంగ పాఠంలో వివరించనప్పటికి రైల్వే బడ్జెట్ వివరాలు బహిర్గతం అయినప్పుడే కేటాయింపులు ఎంత మేర జరిగాయి అనేది తేలబోతోంది. అలాగే కోటిపల్లి-నరసాపురం రైల్వే పనులకు పెద్ద మొత్తంలో కేటాయించే అవకాశాలు ఉన్నాయి. ఈ ఏడాది ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో కోటిపల్లికి రూ.400 కోట్లు కేటాయించారు. ఆ నిధులు పెండింగ్ బిల్లుల చెల్లింపు లకే సరిపోతుండడంతో ఇంకా నిధులు కేటాయించాలని ప్రతి పాదనలు కేంద్రానికి పంపారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుకు ఎంత మొత్తంలో కేటాయించారన్నది మరికొన్ని గంటల్లో తేలనుంది. షెడ్యూల్ ప్రకారం నరసాపురం నుంచి కోటిపల్లి వరకూ చేపట్టిన 57 కిలోమీటర్ల కొత్త రైల్వేలైన్ పనులు 2021 నాటికి పూర్తి కావాలి. ఒప్పందం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన 20 శాతం వాటా మొత్తం చెల్లించకపోవడంతో ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయి. రూ.2,250 కోట్ల అంచనాతో చేపట్టిన పనుల వ్యయం పెరిగింది. ప్రస్తుతం విశాఖపట్నం-విజయవాడ మెయిన్‌లైన్‌లో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కొత్త రైళ్లను నడపలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఈ ప్రాజె క్టును త్వరితగతిన పూర్తి చేయాలని రైల్వే లక్ష్యంగా పెట్టు కుంది. ఈ కారణంగా కోటిపల్లి లైన్‌కు పెద్ద మొత్తంలో నిధు లు కేటాయించే అవకాశం ఉంది. ఎంత మొత్తమనేది బుధవారం విడుదల కానుంది.

దిగమర్రు 165కు నిధులు

ప్రతిపాదనలో వున్న జాతీయ రహదారు లను పూర్తి చేస్తామని కేంద్ర మంత్రి బడ్జెట్‌లో ప్రకటించారు. ఈ లెక్కన పశ్చిమ గోదావరి జిల్లా దిగమర్రు నుంచి ఆకివీడు వరకూ ప్రతి పాదించిన 165 జాతీయ రహదారికి క్లియరెన్స్ దక్కినట్లు భావించవచ్చు. రూ.1,000 కోట్లతో ప్రతిపాదనలను ఎన్‌హెచ్ అధికారులు కేంద్రా నికి పంపారు. వీటిని క్లియర్ చేస్తామని బడ్జెట్‌లో చెప్పడంతో దిగమర్రు-ఆకివీడు నాలుగు లైన్‌ల రహదారికి మోక్షం ల భించే అవకాశం ఉన్నట్లు ఆ శాఖ అధికారులు భావిస్తున్నారు. దీనిపై నేడో, రేపో పూర్తి స్పష్టత రానుంది.

స్టాంప్ డ్యూటీలో చిత్ర విచిత్రం

రిజిస్ట్రేషన్ సమయంలో ప్రభుత్వాలు విధించే స్టాంప్ డ్యూటీల్లో కొంత మేర పెంచేందుకు వీలుగా కేంద్ర బడ్జెట్‌లో మరొక కీలక ప్రకటన చేశారు. రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీని పెంచేందుకు అనువుగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఇప్పటికే ఆర్థిక ఒడిదుడుకుల్లో ఉన్న ప్రభుత్వాలకు ఇది కొంత ఊరట. ఇదే తరుణంలో స్టాంప్ డ్యూటీ పెంచితే ఆ భారమంతా ప్రజల మీదే పడుతుంది. ఈ లెక్కన రియల్ ఎస్టేట్, ఇతర రిజిస్ట్రేషన్‌లో కొంత పుంజుకోగ లవని, ఇప్పటికే అంచనా వేస్తుండగా, తాజా నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. అయితే ఒక వైపు పెరుగుదలను చూపిస్తూనే, ఇంకోవైపు మహిళల పేరిట అయ్యే రిజిస్ట్రేషన్‌కు మాత్రం స్టాంప్ డ్యూటీని తగ్గిస్తూ మరో కీలక ప్రకటన చేశారు. అంటే ఒకవైపు పెంచుతూనే ఇంకో వైపు మహిళలకు మినహాయింపు ఇవ్వడం కొంత ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇది కాకుండా రాష్ట్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు బడ్జెట్‌లో సముచిత ప్రాధాన్యత ఇవ్వడం పట్ల ఇంకొందరు సంతృప్తిగానే ఉన్నారు.



ఆక్వాకు ఊరట..



బడ్జెట్‌లో ఆక్వా రంగానికి చేయూతనిచ్చారు. పన్ను తగ్గించడంతో మేతల ధరలు తగ్గనున్నాయి. ఇవి భారీగా ధరలు పెరిగిపోవడంతో గడచిన ఐదేళ్లు ఈ రంగం గడ్డు కాలాన్ని ఎదుర్కొంది. రొయ్య మేత రూ.93 వేలకు చేరింది. దీనికితోడు విద్యుత్ చార్జీలు, పరికరాల ధరలు ఐదింతలు పెరిగాయి. రొయ్య పిల్ల ధర బెంబేలెత్తించింది. గిట్టుబాటు ధర లేకపోవడంతో సాగు విస్తీర్ణం సగానికి పడిపో యింది. కేంద్ర బడ్జెట్‌లో మేతపై ఐదు శాతం పన్ను తగ్గించడంతో మేత ధరలు తగ్గుముఖం పట్టనున్నాయి. మరోవైపు తల్లి రొయ్య దిగుమ తులపైనా సుంకాన్ని తగ్గించారు. తద్వారా రొయ్య పిల్ల ధరలు ఆశాజనకంగా ఉంటాయని రైతులు భావిస్తున్నారు. రొయ్యల ధరలు పెరిగే సూచనలు కనిపి స్తుండడంతో సాగు మళ్లీ లాభాల బాటలో పయనించనుంది. ఎన్నికల ముందే ఎన్డీయే కూటమి నేతలు రాష్ట్రంలో ఆక్వా రంగానికి పూర్వ వైభవం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. కేంద్రస్థాయిలో సానుకూల నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు రాష్ట్రంలోనూ అదే రకమైన నిర్ణయాలు అమలు చేస్తే ఆక్వా మరింత ఊపు ఏర్పడనుంది. రైతులకు ఊరట లభించనుంది. విదేశీ మారకద్రవ్యం లభించనుంది. పశ్చిమ గోదావరి ఏలూరు జిల్లాల్లో రొయ్యలు, చేపల సాగుపై ఆధారపడే రైతులు, కార్మికులు, పరిశ్రమలకు ఊతం ఏర్పడుతుంది. ఆర్థిక వ్యవస్థ మెరుగు పడుతుంది. చేపల మేత కూడా రెట్టింపయ్యింది. గతంలో రూ.1.20 లక్షలకు లభ్యమయ్యే డీవోడీ ఇప్పుడు రూ.2.50 లక్షలకుపైనే పలుకుతోంది. మరోవైపు చేప ధరలు పతనమయ్యాయి. గిట్టుబాటు కావడం లేదంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఆక్వా రంగానికి పెద్ద పీట వేయడంతో స్థానిక రైతులు ఆనందపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని ఆశిస్తున్నారు.

పోలవరం పూర్తిచేస్తాం



పుట్టా మహేశ్ యాదవ్, ఎంపీ

రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవ రం ప్రాజెక్టుకు బడ్జెట్‌లో అధిక కేటా యింపులు జరగబోతున్నాయి. నిర్మాణ పనులు శరవేగంగా పనులు జరుగుతాయి. కేంద్ర వార్షిక బడ్జెట్‌లో సానుకూల సంకేతాలున్నాయని, రైతులు కలలు కంటున్న పోలవరం పూర్తికావడానికి ఇది దోహద పడుతుంది. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పోలవరం పూర్తి చేయడానికి వీలుగానే కేంద్రం స్పందించడం హర్షణీయం.

రాష్ట్రానికి వరాల జల్లు



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి వరాల జల్లు కురిపించారు. రాజధానికి రూ. 15 వేల కోట్లతో పాటు అదనపు సాయం ప్రకటన హర్షణీయం. పోలవరం నిర్మాణానికి పూర్తి నిధులకు హామీ ఇచ్చారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. విశాఖ, చెన్నై, పారిశ్రామిక క్యారిడార్ వలన ప్రత్యక్షంగా పరోక్షంగా అనేకమందికి ఉపాధి దొరుకుతుంది.

- విక్రమ్ కిషోర్, జిల్లా అధ్యక్షుడు, బీజేపీ


కేంద్ర బడ్జెట్ అద్భుతం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అద్భుతంగా ఉంది. రాజధాని నిర్మాణం, పారిశ్రామికాభివృద్ధి, విద్య, యువత, రైతుల కోసం మంచి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాల వారికి ఆమోదయోగ్యంగా ఉంది.

- రెడ్డి అప్పలనాయుడు, జనసేన జిల్లా నాయకుడు

నిరాశపరిచింది



కేంద్ర బడ్జెట్ రాష్ట్ర ప్రజలను నిరాశ పరిచింది. టీడీపీ, జనసేన కూటమి నేతలు రాష్ట్రానికి ఎక్కువ నిధులు కేటాయించడంలో విఫలమయ్యారు. విభజన హామీలకు కేటాయింపులు లేవు. పోలవరం నిర్మాణం, నిర్వాసితులు, ఆర్అర్ ప్యాకేజీపై స్పష్టత లేదు. రాజధానికి రూ.15 వేల కోట్లు అభినందనీయం.

- బండి వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర నేత

స్పష్టతలేని కేటాయింపులు



రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయించి, మిగిలిన అంశాలకు బడ్జెట్‌లో స్పష్టత లేదు. కేంద్ర బడ్జెట్ పేదలకు ఉపయోగకరంగా లేదు. రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే అంశాలు లేవు. రైతులు, కౌలు రైతులకు అన్యాయం జరిగింది.

ఎ.రవి, జిల్లా కార్యదర్శి, సీపీఎం

కేటాయింపులు హర్షణీయం



రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో కేటాయిం పులు హర్షణీయం. రాష్ట్రాభివృద్ధికి ఎన్‌డీఏ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పడానికి ఇదే నిదర్శనం. పోలవరం, రాజధాని నిర్మాణానికి, పరిశ్రమల ఏర్పాటుకు ప్రధాని ముందుకు రావడం శుభపరిణామం. ప్రజల ఆకాంక్షలు బీజేపీ సహకారంతో నెరవేరతాయి.

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు

తగ్గనున్న పసిడి ధరలు



బంగారం, వెండిపై వున్న 15 శాతం సుంకాన్ని ఆరు శాతానికి తగ్గిస్తున్నట్లు బడ్జెట్‌లో మంత్రి ప్రకటించారు. దీనివల్ల విదేశాల నుంచి దిగుమతి చేసుకునే బంగారం ధరలు తగ్గుతాయి. గడిచిన మూడేళ్ల నుంచి పసిడి, వెండి ధరలు ఆల్ టైం రికార్డు ధరలతో దూసుకుపోతున్నాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలు గ్రాము బంగారం కొనాలంటేనే జంకుతున్నారు. సుంకం తగ్గించడంతో మంగళవారం పసిడి, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. మేలిమి బంగారం గ్రాముకు రూ.250 తగ్గింది. సోమవారం గ్రాము బంగారం రూ.7,420 ఉండగా.. బడ్జెట్ తర్వాత రూ.7,180కి దిగింది. వెండి కేజీకి రూ.5 వేలు తగ్గింది. గత వారం రూ.92 వేలు ఉండగా.. మంగళవారం సాయంత్రం రూ.87 వేలకు దిగింది. ధరలు పతనమవడంతో వినియోగదారుల్లో ఆనందోత్సాహం వ్యక్తమవు తోంది. రాబోయే రోజుల్లో ఇవి మరింత తగ్గుతాయనే ఆశతో ఉన్నారు.

స్టాక్ మార్కెట్ మదుపుదారులకు షాక్



స్టాక్ మార్కెట్ మదుప దారులకు బడ్జెట్‌లో నిర్మలా సీతారామన్ షాక్ ఇచ్చారు. ఏ పన్నును ఎత్తి వేయాలని మదుపుదారులు ఆశించారో.. దాన్నే పెంచి కంగు తినిపించారు. ఇప్పటి వరకు స్వల్పకాలిక పెట్టుబడులపై వచ్చిన లాభంపై 15 శాతం పన్ను ఉండేది. దాన్ని 20 శాతానికి పెంచారు. దీర్ఘకాలిక పెట్టుబడులపై వచ్చిన లాభంపై పది శాతం ఉండే పన్ను 12.5 శాతానికి పెంచారు. ప్రస్తుతం బ్యాంక్ వడ్డీలు తగ్గడంతో చాలా మంది మదుపుదారులు మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతున్నారు. ఈ తరుణంలో ఈ పన్ను విధించడంతో వీరంతా డీలాపడ్డారు.

ఉన్నత విద్యకు బ్యాంకు రుణాలు



ఉన్నత విద్య చదువుకున్న వారికి బ్యాంకులు రుణాలు చెల్లించాలంటే ఇంతకు ముందు ముప్పుతిప్పలు పెట్టేవి. ఈసారి బడ్జెట్‌లో ఉన్నత విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వరాలు ప్రకటిం చింది. ఉన్నత విద్యనభ్యసించాలనుకునే వారికి రూ.10 లక్షల మేర రుణం కల్పించేందుకు కేంద్రం సమ్మతించడంతో విద్యార్థి లోకానికి తీపి కబురు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ



సడక్ యోజన పథకం క్రింద దేశవ్యాప్తంగా దాదాపు 25 వేల గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి వీలు కల్పించింది. రాష్ట్రాల వారీగా దెబ్బ తిన్న రోడ్లకు ప్రతిపాదనలు రప్పించుకుని ఆ మేరకు కేంద్రం నిధులు విడుదల చేస్తుంది. ఈ సారి ఏపీలో ఎంపీల చొరవ ఒక అడుగు ముందుగానే ఉండటంతో రోడ్ల మరమ్మతులకు వీలుగా అధిక నిధులు రాబట్టే అవకాశం ఉంది.



ఇసుక లారీలు పట్టుకుని విచారణ జరుపుతున్న ట్రాస్క్‌ఫోర్స్

ఇసుక అక్రమ తరలింపు

- ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్‌లో నిబంధనలు బేఖాతరు
- కలెక్టర్ ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ బృందం దాడి
- అక్రమ రవాణా గుర్తించి మూడు లారీల సీజ్

కుక్కునూరు, జూలై 23: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక పంపిణీకి అక్రమార్కులు తూట్లు పొడుస్తున్నారు. ఇబ్రహీంపట్నం స్టాక్ పాయిం ట్ నుంచి ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ బృందం దాడి చేసింది. పరిమితికి మించిలోడు ఉన్న తెలంగాణకు చెందిన మూడు టిప్పర్ లారీలు మంగళవారం సీజ్ చేశారు. కుక్కునూరు మండలం ఇబ్రహీంపేట నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారంతో డీపీవో శ్రీనివాస విశ్వనాథ్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందం ఆకస్మికంగా దాడి చేశారు. అనుమతికి మించి ఎక్కువ ఇసుకను తరలిస్తున్న విషయాన్ని గుర్తించారు. తెలంగాణకు చెందిన మూడు లారీలను కుక్కునూరు పంచాయతీ లంకాలపల్లి వద్ద ఆపి అశ్వారావుపేటలో ఎలక్ట్రానిక్ వేబ్రిడ్జ్‌లో కాటా వేయించారు. పరిమితికి మించి 73.450 మెట్రిక్ టన్నులు అదనంగా ఇసుక ఉన్నట్లు గుర్తించ డంతో లారీలను సీజ్ చేసి లారీ యాజమానుల పై కేసులు నమోదు చేసినట్లు డీపీవో తెలిపారు. టాస్క్‌పోర్సు సభ్యులు, పోలవరం డీఎస్పీ ఎన్.సురేష్‌కుమార్‌రెడ్డి, డీడీ మైన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్రహీంపేట ఇసుక స్టాక్ పాయింట్ నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తు న్నారు. స్టాక్ పాయింట్‌లో దాదాపు 95వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉండడంతో అక్రమార్కుల కన్ను పడింది. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక లోడింగ్ జరగాల్సి ఉండగా రాత్రిపూట కూడా ఇసుక లోడింగ్ చేస్తున్నట్లు సమాచారం. 20 మెట్రిక్ టన్నులకు సొమ్ము చెల్లించి ఒక్కో టిప్పర్‌లో 5 నుంచి 10 మెట్రిక్ టన్నుల ఇసుక అదనంగా వేసుకు పోతున్నారు. సాయంత్రం 6గంటల తరువాత తెలంగాణ, ఆంధ్రాకు చెందిన టిప్పర్ వాహనాలు క్యూ కడుతున్నాయి. ఒకో రోజు పదుల సంఖ్యలో టిప్పర్లలో ఇసుక లోడింగ్ చేసి దర్జాగా తెలంగాణ సరిహద్దులు దాటిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. యథేచ్ఛగా ఇసుక దందా సాగుతున్న అధికారులు ఏం చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. స్టాక్‌పాయింట్ వద్ద ఉదయం 6 గంటల నుంచి 12 గంటల వరకు రెవెన్యూ శాఖ, 12గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పంచాయతీ సిబ్బంది పర్యవేక్షణలో ఇసుక అమ్మకాలు జరపాలి. ఒక ప్రత్యేకాధికారిని కూడా నియమించి సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. కానీ సాయంత్రం 6 దాటిన తర్వాత ఇసుక అమ్మకాలు జరుగుతున్నాయి.

ఇసుక అక్రమ రవాణా చేస్తే క్రిమినల్ కేసులు : కలెక్టర్

ఏలూరుసిటీ, జూలై 23: ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాపై దాడులు తీవ్రం ,చేయాలన్నారు. డీపీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆధ్వర్యంలో పోలవరం డీఎస్పీ, మైన్స్ డీడీ, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులతో టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక అక్రమ రవాణా సమాచారంపై ప్రజల సహకారం తీసుకోవాలన్నారు. ఇసుక అక్రమ రవాణా సమాచారాన్ని తనకు 9491041188 నెంబర్‌కు తెలియజేయవచ్చని కలెక్టర్ సూచించారు.

భూ బకాసురులు

- నకిలీ పత్రాలతో భూ విక్రయానికి ప్రయత్నం
- నూజివీడు ఆర్డీవో ఆదేశాలతో పోలీసుల దర్యాప్తు
- తహసీల్దార్ సంతకం ఫోర్జరీ చేసినట్లు గుర్తింపు

నూజివీడు, జూలై 23: నూజివీడులో భూ అక్రమాలతో పలువురు గగ్గోలు పెడుతున్నారు. తాజాగా పట్టణంలో భూ విక్రయం కలకలం రేపింది. గల్ఫ్ దేశంలో ఉంటున్న నూజివీడుకు చెందిన వ్యక్తి కుటుంబా నికి 25 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిపై నూజివీడుకు చెందిన ఒక వ్యక్తి కన్నేసి నకిలీపత్రాలతో భూమిని స్వాహా చేయాలని కుట్ర పన్నాడు. భూ యజమాని ఫ్యామిలీ సర్టిఫికెట్‌ను పేర్లు మార్చి నకిలీ పత్రాలను సృష్టించాడు. నకిలీపత్రాలతో రిజిస్ట్రేషన్‌కు ప్రయత్నించడాన్ని భూ యజ మాని సమీప బంధువు గుర్తించారు. దీనిపై నూజివీడు సబ్ రిజిస్ట్రార్, ఆర్డీవోలకు ఫిర్యాదు చేయడంతో డొంక కదిలింది. అప్పటికే డాక్యుమెంట్లు సక్రమంగా లేవని రిజిస్ట్రేషన్‌కు సబ్ రిజిస్ట్రార్ కె.తులసిరత్నం తిరస్క రించారు. ఆర్డీవో వై.భవానిశంకరికి అందిన ఫిర్యాదు పోలీసులకు పంపి దర్యాప్తు చేయాలని ఆదేశించారు. దర్యాప్తులో తహసీల్దార్ సంతకం ఫోర్జరీ చేసినట్లు తేలడంతో తహసీల్దార్ కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనితో భూమిని స్వాహా చేయడానికి ప్రయత్నించిన వారు పరా రయ్యారు. దీనిపై ఆర్డీవో వై.భవానిశంకరి, మంత్రి కొలుసు పార్థసారథి సీరియస్‌గా ఉన్నారు. కేసు విచారణలో ఉందని పట్టణ సీఐ ఎం.మూర్తి తెలిపారు.

భూ అక్రమాలపై కఠిన చర్యలు : ఆర్డీవో

భూమి అక్రమాలపై ఫిర్యాదు అందడంతో విచారణ పోలీసులను ఆదేశించినట్లు ఆర్డీవో వై.భవానిశంకరి తెలిపారు. ప్రాథమిక విచారణలో తహసీల్దార్ సంతకం ఫోర్జరీ అని తేలిందన్నారు. భూములను నకిలీ పత్రాలతో అమ్మకాలకు ప్రయత్నించడం నేరమని, కఠిన చర్యలు తీసు కుంటామన్నారు. అక్రమాలు గుర్తించిన వారు సమాచారం ఇవ్వాలన్నారు.

రిజిస్ట్రేషన్ చేయలేదు : సబ్ రిజిస్ట్రార్

ఇటీవల 25 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ కోసం కొందరు వచ్చారు. సరైన పత్రాలు వారివద్ద లేకపోవడంతో తాను రిజిస్ట్రేషన్ చేయలేనని వారికి స్పష్టం చేసినట్లు సబ్ రిజిస్ట్రార్ కె.తులసిరత్నం తెలిపారు. దీంతో వారు వెళ్లిపోయారని ఆమె తెలిపారు. బయట ఏం జరిగిందో తనకు తెలియదన్నారు. ఈ విషయాన్నే తాను నూజివీడు ఆర్డీవో, ఉన్నతాధి కారులకు తెలియజేశానన్నారు.

ఎంపీడీవో అదృశ్యం విషాదాంతం

- వారం నుంచి గాలింపు.. ఏలూరు కాల్వలో మృతదేహం లభ్యం
- కానూరులో అంత్యక్రియలు
- ఎమ్మెల్యే నాయకర్ నివాళి.. ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యోగుల సంతాపం..

నరసాపురం రూరల్, జూలై 23 : పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవో వెంకటరమణ అదృశ్యం.. విషాదాంతాన్ని మిగి ల్చింది. విజయవా డలోని ఏలూరు కాల్వలో ఆయన మృతదేహం మంగళవారం లభ్యమైంది. వారం రోజులుగా ఆయన ఆచూకీ లేకపోవడంతో ఎక్కడో చోట క్షేమంగా ఉన్నారని అంతా భావించారు. చివరకు ఇలా చనిపోవడంతో అందరినీ కలిచి వేసింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో గత వారం రోజులుగా ఇదే చర్చ నడిచింది. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సైతం ఎంపీడీవో కుటుంబీకులతో మాట్లాడి ధైర్యం కల్పించారు.

ఎంపీడీవోగా వచ్చి.. ఇలా బలై..

ఎన్నికల సమయంలో నరసాపురం ఎంపీడీవో గా వచ్చిన వెంకటరమణ ఇక్కడ పనిచేసింది కేవ లం ఐదు నెలలు. ఆయన మంచితనంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పంచాయతీ, సచివాలయం, మండల పరిషత్ ఉద్యోగులతోపాటు ప్రజలకు దగ్గరయ్యారు. మరో ఆరు నెలల్లో ఆయన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కోడ్ రావడం.. నరసాపురం రేవు పాట ముగియ డం ఆయన ప్రాణాల మీదకు వచ్చింది. అప్పటి వరకు రేవును నిర్వహించిన పాటదారుడు రెడ్డప్ప ధవేజీని కొనసాగించారు. రేవు నిర్వహణదారు రోజు వారి సొమ్మును చెల్లిం చకపోవడంతో రెండు నెలలు గా ఎంపీడీవో ఎంతో మాన సిక ఒత్తిడికి గురయ్యారు. ఎప్పుడు ఫోన్ చేసినా.. నిర్వ హణదారుడు సమాధానం ఇచ్చేవాడు కాదు. రెండు, మూడుసార్లు ఆయన ఇంటికి వెళ్లి బాకీ కట్టాలని వేడుకున్నారు. పలుమార్లు నోటీసులు ఇచ్చి, జేఏసీ కమిటీ సమక్షంలో ఫోన్ చేసినా నిర్వహణదారు బకాయి చెల్లించలేదు. దీంతో మానసిక ఒత్తిడికి గురై ఈ నెల మొదటి వారంలో సెలవుపై వెళ్లిపోయారు. తర్వాత పెన మలూరు మండలం కానూరులోని తన ఇంటి నుంచి బయటకు వెళ్లి.. ఏలూరు కాల్వలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. అప్పటికే ఆయన తన బాధను వ్యక్తం చేస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేరిట ఒక లేఖను కూడా రాశారు. ఇందు లో పాటదారుడు రెడ్డప్ప ధవేజీ, మాజీ ఎమ్మెల్యే ముదునూరు ప్రసాదరాజుల పేర్లను ప్రస్తావించా రు. తన ఆత్మహత్యకు వాళ్లిద్దరే కారణమని పరో క్షంగా ప్రస్తావించినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఏలూరు కాల్వలో గాలిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృం దాలు మంగళవారం ఉదయం భౌతికకాయాన్ని కనుగొన్నారు. కుమారులు సాయిరాం, మహీధర్ ఘటనా స్థలానికి వెళ్లి తమ తండ్రి మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం విజయవాడ ప్రభుత్వాసు పత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అశ్రు నయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.



నరసాపురంలో ఉద్యోగుల నివాళి (ఇన్‌సెట్) వెంకటరమణ

ఎమ్మెల్యేల నివాళి..

అసెంబ్లీ సమావేశాల్లో వున్న నరసాపురం, పెన మలూరు ఎమ్మెల్యేలు బొమ్మిడి నాయకర్, బోడె ప్రసాద్, ఎంపీడీవో మృతదేహం లభ్యమైందన్న సమాచారం తెలుసుకున్న వెంటనే ఘటనా స్థలా నికి వెళ్లి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివా ళులర్పించారు. ప్రభుత్వపరంగా అండగా ఉంటా మని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఎంపీ డీవో మృతి సమాచారం తెలిసిన ప్రజా ప్రతిని ధులు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది నరసా పురం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో వీరభద్రరావు, శర్మ, నాగేశ్వరరావు, శ్రీరామ్, సురేష్, సిబ్బంది సంతాపం తెలిపారు.

చర్యలు తీసుకోవాలి..

ఎంపీడీవో మృతికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు డిమాండ్ చేశారు. రేవు నిర్వహణదారు ధవేజీ, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఆయనను తీవ్ర మానసిక ఒత్తిడికి గురి చేశారని, ఈ కారణంగానే ఎంపీడీవో ఆత్మహత్యకు పాల్ప డ్డారని ఆరోపించారు. మంచి అధికారిని కోల్పోవ డం బాధాకరమని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బా రాయుడు అన్నారు. పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం


చెక్కు అందజేస్తున్న ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్

ఏలూరు క్రైం, జూలై 23 : అనారోగ్యంతో మృతి చెం దిన కానిస్టేబుల్‌కు ఫ్లాగ్ ఫండ్ రూ.25 వేలను, విడో ఫండ్ రూ.50 వేలను చె క్కు రూపంలో మృతుడి భార్య దుర్గాదేవికి జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ మంగళవారం ఏలూరు జి ల్లా పోలీస్ కార్యాలయం లో అందజేశారు. ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న దాసరి మధుకుమార్ అనారోగ్యంతో మరణించాడు. దీంతో అతనికి వచ్చిన నగదు చెక్కులను అంది ంచి ఎస్పీ మాట్లాడుతూ ప్రభు త్వం తరఫున మృతుడి కుటుంబానికి అందవల సిన ఆర్థిక సహాయాన్ని సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. వారి కుటుంబంలో అర్హులైన వారికి కారుణ్య నియామకం కోసం ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు. అదనపు ఎస్పీ జి.స్వరూపరాణి, పోలీస్ అధికారుల సంఘ నాయకులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగం పై అధికారుల విచారణ

లింగపాలెం, జూలై 23: ఉపాధి హామీ పనుల్లో నిధుల దుర్వినియోగం పై విచారణ ప్రారంభించారు. సింగగూడెంకి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హా మీ పనుల్లో నిధులను దుర్వినియోగం చేసినట్లు ఇటీవల గ్రామస్థులు ఉన్నతా ధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారణ ప్రారంభించారు. ఏపీ డీ శ్రీదేవి, ఎంపీడీవో రాంబాబులు విచారణ ప్రారంభించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఉంగుటూరు, జూలై 23 : ఉపాధ్యాయుల పరిష్కారం కోరుతూ వివిధ శా ఖల అధికార్లకు మండల యూటీఎఫ్ నేతలు మంగళవారం వినతిపత్రాలు అం దజేశారు. రాష్ట్ర యూటీఎఫ్ పిలుపు మేరకు మండల శాఖ అధ్యక్షప్రధాన కార్యదర్శులు డాకి జోగి నాయుడు, ఉనుముల రాంబాబు,శీతాల సత్యనారాయ ణ, పుప్పాల నరసింహారావు, లక్ష్మీనారాయణ తహసీల్దార్ కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ బొడ్డేపల్లి దుర్గాప్రసాద్, ఎంపీడీవో శర్మ, విద్యాశాఖాధికారులు రవీంద్ర భారతి, కాండ్రేగుల శ్రీనివాసరావులకు వేరు వేరుగా వినతి పత్రాలు అందజేశారు.

విద్యుత్ మీటర్ రీడర్లకు న్యాయం చేయాలి

ఏలూరు కార్పొరేషన్, జూలై 23 : కూటమి ప్రభుత్వం విద్యుత్ మీటర్ రీడర్లకు న్యాయం చేయాలని ఏపీ విద్యుత్ మీటర్ రీడర్ల జిల్లా అధ్యక్షుడు కె.శివారెడ్డి అన్నారు. స్థానిక స్ఫూర్తి భవన్‌లో మంగళవారం జరిగిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ మీటర్ రీడర్లకు పీస్ రేటు సక్రమంగా కాంట్రా క్టర్లు చెల్లించడంలేదని యాజమాన్యానికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కార్యదర్శి కె.బుచ్చిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు బి.వెంకటేశ్వరరావు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా మీటర్ల రీడర్ల సంఘానికి జిల్లా అధ్యక్షుడిగా ఒ.శ్రీని వాస్, కార్యదర్శిగా జి.దుర్గారావును ఎంపిక చేశారు.

కాపు సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడిగా జైనేంద్ర



పెదపాడు, జూలై 23 : కాపు సంక్షేమ సేవా సంఘం దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షునిగా అప్పనవీ డుకు చెందిన కేతినీడి జైనేంద్ర ఎన్నికైనట్లుగా కాపు సంక్షేమ సేవా సంఘం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. జైనేంద్ర గతంలో అప్పనవీడు లోని అభయాంజనే యస్వామి దేవస్థానం ఛైర్మన్‌గా వ్యవహరించారు.

కోళ్లవ్యర్థాల రవాణా నియంత్రణకు ప్రత్యేక నిఘా

పెదపాడు, జూలై 23 : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి హాని కలిగించే కోళ్ల వ్యర్థాల రవాణాను అరికట్టేందుకు తహసీ ల్దారు పర్యవేక్షణలో పోలీసు, రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులతో కలిసి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లుగా పెదపాడు ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ, మత్స్యశాఖ సిబ్బందితో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ రవాణా మార్గాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, సిబ్బంది గస్తీ నిర్వహిస్తారన్నారు. తహసీల్దారు భావన్నారాయణ, మత్స్యశాఖ ఏడీ రాజ్‌కుమార్, అసిస్టెంట్ మత్స్యశాఖ అధికారి సతీష్‌కు మార్, వీఆర్వోలు, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులందరూ సీసీఆర్‌సీ కార్డు తీసుకోవాలి

ఏలూరు రూరల్, జూలై 23: కౌలు రైతులందరూ గ్రామ రెవెన్యూ అధికారి ద్వారా క్రాప్ కల్టివేటెడ్ రైట్ కార్డు (సీసీఆర్‌సీ) తీసుకోవాలని ఎంఏవో సంధ్య తెలిపారు. చాటపర్రులో వ్యవసాయశాఖ అందజేస్తున్న వివిధ పథకాలు, సీసీఆర్‌సీ కార్డులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లా డారు. వ్యవసాయ శాఖ అందజేస్తున్న విత్తనాలు, ఎరువులు, బ్యాంకు నుంచి రుణాలు, వంటివి పొందాలంటే సీసీఆర్‌సీ కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. సీసీఆర్‌సీ కార్డుల కోసం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

ఆగస్టు 2న బార్ అసోసియేషన్ ఎన్నికలు

ఏలూరు క్రైం, జూలై 23 : ఏలూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులకు ఆగస్టు రెండున ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన ఎన్నికల అధికారి ఎంవీ నారాయణరాజు తెలిపారు. 25న నామినేషన్ల స్వీకరణ, నామినేషన్లను పరిశీలన, 26న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. ఇప్పటికే అభ్యర్థులు ప్రచారాన్ని చేపట్టారు.

26న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ఏలూరు సిటీ, జూలై 23: ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో ఈ నెల 26న ఏలూరు డివిజన్ పరిధిలోని ఏలూరు రూరల్ సబ్‌డివిజన్ కార్యాలయంలో (బాలయోగి సైన్స్‌పార్క్, అశోక్‌నగర్ సబ్‌స్టేషన్ వద్ద) విద్యుత్ వినియోగ దారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ జేవీబీ నటరాజన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు


ఫాగింగ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఏలూరు టూ టౌన్, జూలై 23: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా చర్యలు తీసుకుం టున్నట్లు ఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి తెలిపారు. స్టాప్ డయేరియా కార్యక్ర మంలో భాగంగా 13వ డివిజన్‌లో దోమల నిర్మూలన చేపట్టారు. వైఎస్సార్ కాలనీ, మరడాని రంగారావు కాలనీ, వీఎస్‌ఆర్ బ్రాండ్ సిటీ ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్, మురుగు కల్వర్టు క్రింద ఫాగింగ్, నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేసినట్లు డాక్టర్ మాలతి తెలిపారు. మలేరియా ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలస్వామి, దుర్గారావు, ఎం.శ్రీనివాస్, ఆరోగ్య కార్యదర్శులు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రికి పెరిగిన రోగులు

ఏలూరు క్రైం, జూలై 23 : వాతావరణంలో మార్పుల వల్ల అనేక మంది వివిధ వ్యాధుల బారినపడ్డారు. ఎక్కువగా జ్వరాలు, ఆస్తమా వంటి వ్యాధు లతో ఎక్కువగా వచ్చారు. చెవి నొప్పి, కళ్ళు నొప్పులు అంటూ కొంత మంది ప్రభుత్వాస్పత్రికి వచ్చారు. వారం రోజుల తరువాత కాస్త వర్షం ఆగి ఎండ రావ డంతో మంగళవారం 800 మంది రోగులు ఓపీకి వచ్చారు. వారిలో డెంగీ జ్వరాలు ఉన్న వారే ఉన్నట్లుగా ప్రాథమికంగా నిర్ధారణ చేస్తున్నారు. జ్వరం వస్తే తక్షణం వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

అరాచకాల పై ఏం సమాధానం చెబుతారు

ఏలూరు టూ టౌన్, జూలై 23: వైసీపీ పాలనలో దళితుల పై చేసిన కిరాతకాలకు ఏం సమాధానం చెబుతారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కందుల రమేష్ ప్రశ్నించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో రమేష్ మాట్లాడుతూ ఒక్క వైసీపీ కార్యకర్త హత్య జరిగితే ఢిల్లీ వెళ్ళి జగన్ నిరసన చేశాడన్నారు. టీడీపీ పెట్టి 27 దళిత పథకాలను రద్దు చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు.

సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు

జంగారెడ్డిగూడెం, జూలై 23 : గ్రామ సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశామని ఎంపీడీఓ కేవీ ప్రసాద్ తెలిపారు. మండలంలో పలు ఆధార్ నమోదు కేంద్రాలను మంగళ వారం ఆయన పరిశీలించారు. నరసాపురం ఎంపీడీఓ యం.వెంకటరమణారావు అకాల మృతికి ఎంపీడీఓ కార్యాలయంలో ప్రసాద్, సిబ్బంది నివాళులర్పించారు.

వరద తగ్గే వరకు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు సిటీ, జూలై 23: జిల్లాలో వరద ప్రభావం పూర్తిగా తగ్గే వరకు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించామని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. జిల్లాలో ఇటీవల కురిసిన భారీవర్షాలు, వరదలు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో తీవ్ర ప్రభావాన్ని చూపాయన్నారు. వరదలకు 10 గ్రామాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, వివిధ శాఖలకు సంబం ధించి రూ.187 కోట్ల మేర నష్టం వాటిల్లిందన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండ లాల్లో వరద ప్రభావిత గ్రామాలలోని 6,311 మందిని 21 పునరావాస కేంద్రా లకు తరలించి భోజన, వసతి సౌకర్యాలు కల్పించామన్నారు. 231 ఇళ్ళు దెబ్బతి న్నాయన్నారు. 30 గొర్రెలు, పాడిపశువులు చిపోయాయన్నారు. 5,305 హెక్టార్లలో పంట నష్టం కలిగిందని, 64 హెక్టార్లలో ఉద్యానవన పంటలు నీట మునిగా యన్నారు. 333 కిలోమీటర్ల మేర రోడ్లు భవనాల శాఖ రహదారులు దెబ్బతి న్నాయని, దీనివల్ల రూ.167 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి 13 రోడ్లకు రూ.75 లక్షలు, మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించి 17 నీటి వనరులకు రూ.మూడు కోట్ల నష్టం వాటిల్లిందని కలెక్టర్ తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ పైప్ లైన్లు, విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయని , అధికారులు యుద్ధప్రాతిపదికన మర మ్మతులు చేపట్టారన్నారు. వరద ప్రభావిత గ్రామాల ప్రజలకు బియ్యం, కంది పప్పు, వంటనూనె, కాయగూరలు, వాటర్‌ప్యాకెట్, పాలు, కొవ్వొత్తులు , దోమల నిర్మూలన మందులు, బిస్కట్లు పంపిణీ చేయటం జరిగిందన్నారు. ఇళ్ళు దెబ్బ తిన్న కుటుంబాలకు 800 టార్పాలిన్లు అందజేశా మన్నారు. ప్రస్తుతం వరద పరిస్థితి అదుపులో ఉందని , అయినప్పటికీ వరద ప్రమాదం పూర్తిగా తగ్గే వరకు కేంద్ర, రాష్ట్ర విపత్తు నివారణా దళాలు , బోట్లను సిద్ధంగా ఉంచా మన్నారు. వరద ప్రభావిత గ్రామాల్లో విద్యుత్, సమాచార వ్యవస్థలకు ఎటు వంటి ఆటంకం కలుగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. వర దల కారణంగా ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా వారం రోజులుగా జిల్లా యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకుందని, ప్రజలు కూడా సహకరిం చారని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు.

నీట మునిగిన 200 ఎకరాలు

నిడమర్రు జూలై 23 :వారం రోజులుగా కురిసిన వర్షాలకు గోదావరి కాలువ ల్లో నీరు పొంగి పొర్లడంతో వరి చేలన్నీ నీట మునిగాయి. మండలంలో ప్రధా నమైన చినకాపవరం పంట కాలువలోకి నీరు చేరడంతో కాలువ గట్లు వెంబడి ప్రవహిస్తోంది. దీనికి తోడు చినకాపవరం వద్ద లాకులు పూడుకు పోవడంతో నీరు పోయే మార్గం లేక వరద నీరు తన్నిపెట్టుకొని కూర్చుంది. కాలువ లోకి వరద నీరు చేరడంతో భువ్వనపల్లి ఆయుకట్టులో సుమారు 200 ఎకరాలు పూర్తిగా నీటమునిగాయి. ఉదయం మొద లైన వరద నీరు సాయంత్రానికి సుమారు మూడు అడుగుల మేర పెరిగి ఊరికి సమీపాన గల జగనన్న కాలనీ వీధుల్లోకి చేరింది. ఇక్కడ సుమారు రెండు అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. దీంతో కాలనీ వాసులు దిక్కుతోచని స్థితిలో సాయం కోసం ఎదురు చూస్తున్నారు. రెవెన్యూ యంత్రాంగం, ఇరిగేష న్ సిబ్బంది ఎప్పటి కప్పుడు సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేస్తున్నారు. జనసేన, తేదాపా నాయకులు అధికారులతో చర్చించి వరద నీరు తగ్గేలా చూడాలని కోరుతున్నారు. ఇదిలావుండగా చినకాపవరం కాలువకు దిగు వన వ్యవసాయ పొలాల రైతులు నడుం బిగిం చి తమ సొంత ఖర్చులతో ఏటుగట్టు మీద రక్షణ చర్యలు చేపడుతున్నారు. ఎగువన గల కాపవరం కాలువకు గండి పడితే తమ పొలాలు పూర్తిగా మునిగిపోయి గ్రామాల్లోకి నీరు వస్తుం దని భావించిన రైతులు నిన్న రాత్రి నుంచి కాలువ గట్టు వద్ద కాపలా కాస్తూ సుమారు రెండు వేల సంచుల మట్టి మూటలతో గట్టు ఎత్తు చేసుకుంటున్నారు. సుమారు 200 మంది రైతులు రేయింబ వళ్లు కష్టపడి తమ పొలాలను కాపాడుకొనే ప్రయత్నం అందరినీ ఆశ్చర్యాన్ని గురిచేసింది. ఎనికేపల్లి రైతులు మట్టిని ట్రాక్టర్లతో తెప్పించుకొని మూటల్లో ఎత్తి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా కృషి చేసి కాలువ లో వరద నీటిను ఆపుకుంటున్నారు. అలాగే అడవికొలను రైతులు రెండు జేసీబీలతో చేల ల్లో మట్టి తవ్వి పంట కాలువ గట్టుపై మూ డు అడుగుల మేర పోసి వరద నీరు పొంగి పొర్లకుండా తమ పొలాలను కాపాడుకుంటు న్నారు. అలాగే క్రొవ్విడి ఉప్పరగూడెంలో రైతు లు జనసేన నాయకులు ఆధ్వర్యంలో కాలువ గట్టు పై నుంచి వరద నీరు రాకుండా గట్టుకు పటిష్ట చర్యలు చేపడుతున్నారు. జనసేన నా యకులు నిమ్మల దొరబాబు, వి.ఇంద్ర కుమార్, ఎస్.లెనిన్‌బాబు, పాలొన్నారు.


చిన కాపవరం పంటకాలువ గట్టుకు మట్టి మూటలు వేసి ఎత్తు చేసుకొంటున్న ఎనికేపల్లి, అడవికొలను రైతులు

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి, జూలై 23 : సమస్యల పరిష్కారానికి ప్ర త్యేక చర్యలు తీసుకుంటామని దెందులూరు ఎమ్మెల్యే చింత మనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల కార్యాలయంలో మంగళవారం ప్రజల సమస్య లు విన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరాచక పాలన చేసిన జగన్‌ను ప్రజలే ఇంటికి పంపాన్నారు. అయినా ఇప్పటికీ జగన్‌లో మార్పు అనేదిలేదన్నారు. రాష్ట్రంలో రాజకీయ హత్యలు అంటూ విషప్రచారం చేస్తూ ధర్నాలు చేయడం అతని దిగజారుడు రాజకీయానికి నిదర్శనమ న్నారు. వైసీపీ పాలనలో ఇబ్బందులు పడిన ప్రతిఒక్కరికీ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభాకర్ భరోసా ఇచ్చారు. పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, లావేటి శ్రీనివాసరావు, మాగంటి నారాయణ ప్రసాద్, నంబూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమ భవన నిర్మాణానికి కృషి చేస్తాం


శేఖర్‌కు నగదు అందచేస్తున్న టీడీపీ నేతలు

జంగారెడ్డిగూడెం, జూలై 23 : పట్టణం లోని శ్రీసీతా మహా లక్ష్మి వృద్ధాశ్రమానికి ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ద్వారా స్థలం సేకరించి భవన నిర్మాణానికి కృషి చేస్తామని పట్టణ టీడీపీ అధ్యక్షుడు రావూరి కృష్ణ అన్నారు. సీతామహాలక్ష్మి వృద్ధాశ్రమానికి పలువురు టీడీపీ నాయకులు మంగళవారం వెళ్లి అక్కడి పరిస్థితులను సంస్థ నిర్వా హకుడు జయవరపు శేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. వర్షాలకు ఆశ్రమంలోకి వరద నీరు చేరి వృద్ధులు ఇబ్బందులు పడ్డారని తమ ఆశ్రమానికి ప్రభుత్వం నుంచి స్థలం కావాలని నాయకులను కోరడంతో ఎంపీ, ఎమ్మెల్యే దృష్టికి విషయాన్ని తీసుకువెళ్తామన్నారు. ఈ సందర్భంగా నాయకులు కొంత నగదు ను శేఖర్‌కు అందచేశారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పెనుమర్తి రామ కుమార్, తూటిగుంట రాము, చిట్రోజు తాతాజీ, అల్లూరి రామకృష్ణ, చేను ప్రసాద్, ఆంజనేయులు, రమేష్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ షర్మిలా రెడ్డిని కలిసిన సీత



పోలవరం, జూలై 23 : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు వైఎస్ షర్మి లా రెడ్డిని పోలవరం మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు ముచ్చిక సీత సోమవారం కలిసి పోలవరం సమస్యలను వివరిం చినట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసి తుల సమస్యలు, ఆర్ అండ్‌ఆర్ సమ స్యలు, ప్రత్యేక పోలవరం జిల్లా ఏర్పాటు అవసరం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, నియోజకవర్గంలో పార్టీ బలోపేతం అంశాలపై షర్మిలారెడ్డికి వివరించగా, సానుకూలంగా స్పందించారని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పోలవరం పర్యటన చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

ఏలూరు రూరల్, జూలై 23: ఏలూరు స్మార్ట్ సిటీ, లయన్స్ క్లబ్, ట్రీస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వైఎస్ కాలనీలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు క్లబ్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, ట్రీస్ సంస్థ, క్లబ్ జడ్‌సీ దిడ్లా యాంజి నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు.

డ్రైనేజీలలో సిల్ట్ తొలగింపు

జంగారెడ్డిగూడెం పట్టణంలోని ప్రధాన డ్రైనేజీలలో సిల్ట్ తొలగింపు పను లు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ జె.నరేంద్రకుమార్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న టాక్సీ స్టాండ్ నుంచి ఈ పనులను ప్రారంభిం చారు. వర్షాలకు డ్రైనేజీలలో చెత్త పేరుకుపోవడంతో మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో చేపట్టిన పారిశుధ్య పనులపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముత్తారెడ్డికి టీడీపీ నాయకుల పరామర్శ



జంగారెడ్డిగూడెం, జూలై 23 : హైదరాబాద్‌లో గుండె సంబం ధిత సర్జరీ చేయించుకున్న చింతలపూడి టీడీపీ సీనియర్ నాయకుడు జగ్గవ రపు ముత్తా రెడ్డిని పట్టణ నాయకులు హైదరాబాద్ వెళ్లి ఆయన కుమారుని ఇంటి వద్ద మంగళ వారం పరామర్శించారు. పార్టీ సీనియర్ నాయకులు ఎం.లక్ష్మణరావు, ఎం. నాగేశ్వరరావు, బి.సత్యనారాయణ రెడ్డి, జి.రామకృష్ణారెడ్డి ఉన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలని వినతి


మంత్రికి వినతి పత్రం ఇస్తున్న శేషు

జంగారెడ్డిగూడెం, జూలై 23 : రాష్ట్రంలోని అంబేడ్కర్ గురుకుల పాఠ శాలల్లో విద్యార్థుల సం ఖ్య పెంచాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామికి రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు మంగళ వారం వినతి పత్రం అంద జేశారు. వెలగపూడి సచివా లయంలో మంత్రి చాంబర్‌లో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి గురుకు లాల్లో ఉన్న సమస్యలను వివరించినట్లు శేషు తెలిపారు.

అప్రమత్తత అవసరం

చింతలపూడి, జూలై 23: నాగిరెడ్డిగూడెం వద్ద ఉన్న తమ్మిలేరు రిజర్వా యర్‌ను మంగళవారం జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర సందర్శించారు. ప్రాజెక్టు ఏఈ పరమానందం నుంచి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టింది. జలాశయంలో 348.50 అడుగులకు నీరు చేరింది. ఎగువ నుంచి సాయంత్రానికి 787 క్యూసెక్కులు నీరు మాత్రమే వస్తోంది. వరద తాకిడికి రిజర్వాయర్ భారీగా నీరు చేరింది. చింతలపూడి సీఐ సుధాకర్, ఎస్సై కుటుంబరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై ఖండన

భీమడోలు, జూలై 23 : సోషల్ మీడియా వేదికగా తెలంగాణ ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ వికలాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని దివ్యాంగుల సంఘం తీవ్రంగా ఖండిస్తున్నట్లు దివ్యాంగుల సమితి అధ్యక్షుడు మామిడిపల్లి నాగభూషణం తెలిపారు. అధికారిణిపై చర్యలు తీసుకోవాలంటూ భీమడోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాయకులు చిప్పాడ బాలు, బెంజిమన్, నాగేశ్వరరావు, తాతాచారి పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

వేలేరుపాడు, జూలై 23: వరదలకు కమ్మరిగూడెం మేడేపల్లి, అల్లూరినగర్, మ రో తొమ్మిది గ్రామాల ప్రజ లకు తీవ్ర నష్టం జరిగిందని ప్రభుత్వం తక్షణమే ఆదుకో వాలని సీపీఐఎంఎల్ ప్రజా పంథ, జంగారెడ్డిగూడెం డివి జన్ కమిటీ కార్యదర్శి ఎస్‌కే గౌస్ డిమాండ్ చేశారు. టార్పాలిన్లు ఇవ్వాలని, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, విషజ్వరాలు ప్రబలకుండా గ్రామాల్లో దోమల మందు పిచికారీ చేయించాలని వైద్య శిబిరాలు నిర్వహించాలని అధికారులను కోరారు. నష్టపోయిన ప్రజలకు తక్షణం ఆర్థిక సాయంగా కుటుంబానికి రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆస్తులు, సర్వస్వం కోల్పోయిన కుటుంబాలకు రూ. రెండు లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, పొలా ల్లో వేసిన ఇసుక మేటలను ప్రభుత్వమే తొలగించాలని డిమాండ్ చేశారు. రామారావు, ముత్యాలరావు, కె.వీరాస్వామి, ఎస్‌కే మున్నీ పాల్గొన్నారు.

పాపదాస్ మరణం తీరని లోటు

బుట్టాయగూడెం, జులై 23 : మండలంలో సీనియర్ నాయకుడు పాముల పాపదాస్ మరణం పార్టీకి తీరనిలోటని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు డేగా ప్రభాకర్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ మరణించిన పాపదాస్ మృత దేహానికి మంగళవారం ఎర్రజెండా కప్పి జోహర్లు అర్పించారు. కుటుంబ సభ్యు లకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ముమ్మరంగా వరద సహాయక చర్యలు

జంగారెడ్డిగూడెం, జూలై 23 : గోదావరి వరద ముంపు ప్రాంతాలైన వేలేరుపాడు మండలంలోని 36 గ్రామాలను వరద ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించి సహాయక చర్యలు చేపడుతున్నట్లు జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కె.అద్దయ్య తెలిపారు. కోయిదా, కటుకూరు, నార్లవరం, రుద్రంకోట, తాట్కూరు గొమ్ము, రేపాకగొమ్ము గ్రామల్లోని వరద ప్రభావిత కుటుంబాలకు నాలుగు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశా మన్నారు. ప్రస్తుతం శివకాశీపురంలోని పునరావాస కేంద్రానికి రేపాకగొమ్ము నుంచి 393 కుటుంబాలను, నెమలిపేట ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని పునరావాస కేంద్రానికి వేలేరుపాడు నుంచి 15 కుటుంబాలను తరలించామన్నారు. ప్రస్తుతం 15 వరద ప్రభావిత గ్రామాలకు నిత్యావసర సరుకులైన కూరగాయలు, పాలు, కొవ్వొత్తులు, వాటర్ ప్యాకెట్లు, మస్కిటో కాయిల్స్, బిస్కెట్లు, 800 టార్పాలిన్లు పంపిణీ చేశామ న్నారు. ప్రాణ నష్టం జరగకుండా ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బందిని, విద్యుత్ సమస్య రాకుండా జనరేటర్లు అందుబాటులో ఉంచామన్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించి మూడో ప్రమాద హెచ్చరికకు అనుగుణంగా వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి 18 బోట్లు అందుబాటులో ఉంచామన్నారు.

ముంపు గ్రామాల్లో పర్యటించిన డ్వామా పీడీ

కుక్కునూరు, వేలేరుపాడు, జూలై 23: కుక్కునూరు మండలంలోని ముంపు గ్రామాల్లో డ్వామా పీడీ, మండల ప్రత్యేకాధికారి ఎ.రాముం మంగళవారం పర్యటించారు. కుక్కునూరు ఎ.బ్లాక్, బెస్తగూడెం, ఆంబోతులగూడెం, చివ్వాక, మర్రిపాడు పునరావాస కాలనీలను సందర్శించారు. నిర్వాసితులకు అందుతున్న సాయంపై ఆరా తీశారు. తహసీల్దార్ అచ్యుతకుమారి, ఎంపీడీఓ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రుద్రమ్మకోటలో కూరగాయల పంపిణీ


రుద్రమ్మకోటలో కూరగాయలు పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

వేలేరుపాడు, జూలై 23: వర దల బాధితులకు కూరగా యలు నిత్యవసర సరుకులను అధికా రులు ఆయా గ్రామాలకు పడవ ల ద్వారా చేరవేస్తున్నారు. రుద్ర మ్మకోటలో అధికారులు పంపిం చిన కూరగాయలను కూటమి నాయకులు కవర్లలో ప్యాక్ చేసి గ్రామస్థులకు అందించారు. కూట మి నాయకులు సుభాష్ చంద్ర బోస్, అమరవరపు వెంకన్న, కొవ్వాల క్రాంతికుమార్, నరసింహారావు, బాబ్జీ, కొఠారి సత్యనారాయణ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ముంపు పొలాలను పరిశీలించిన అధికారులు

భీమడోలు, జూలై 23 : ముంపునకు గురైన పంట పొలాలను ఆచార్య ఎన్‌జీ రంగా పరిశోధనా సంచాలకులు లామ్‌ఫామ్ గుంటూరు పీవీ సత్యనారాయణ, కె.ఫణికుమార్ మంగళవారం పరిశీలించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఏడీఏ ఉషారాజకుమారి, ఏవో ఉషారాణి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

● ఉంగుటూరు : మండలంలోని నారాయణపురం ఆయుకట్టులో ముంపు పొలాలను సర్పంచ్ దిడ్ల అలకనంద, ఎంఏవో బాలిన వెంకటేష్ పరిశీలించారు. డెల్టా పొలాలు నీరు తీస్తేగాని పరిస్థితి అంచనా వేయలేమన్నారు. మాజీ ఎంపీపీ గోలి శ్రీనివాసరావు, గోలి ప్రసాద్, సప్పా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో పశువైద్య శిబిరాలు

ఏలూరు టూ టౌన్, జూలై 23: వరద ప్రభావిత ప్రాంతాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ నెహ్రూబాబు తెలిపారు. నాలుగు రోజుల్లో 121 ఆవులు, 51 గేదెలు, 132 మేకలు, 35 గొర్రెలకు వైద్య సేవలందించామన్నారు. మినరల్ మిక్చర్ 339 కేజీలు పంపిణీ చేశామన్నారు. వేలేరుపాడు మండలం మేడేపల్లి, కోయమాధారం, రామవరం, ఉదయనగర్, ఉండ్లపై, కుక్కునూరు మండలంలో ఇసుకపాడు, కొమ్ముగూడెం, ఉప్పరమద్దిగట్ల, లచ్చిగూడెం, తదితర ప్రాంతాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించామన్నారు.

అగ్ని వీర్‌పై అవగాహన

ఉంగుటూరు, జూలై 23 : నారాయణపురం డిగ్రీ కళాశాలలో మంగళవారం అగ్నివీర్‌వాయుపై అవగాహన కల్పించారు. జిల్లా ఉపాధి కార్యాలయంతో పాటు కెరీయర్ సర్వీసెస్ విభాగం ఆధ్వర్యంలో యంగ్ లీడర్ గట్టిం ప్రవీణ్ కృష్ణ అవగాహన కల్పించారు.

కేంద్ర బడ్జెట్ బాగానే ఉంది కాని..

ఏలూరు అర్బన్, జూలై 23 : కేంద్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తూ వివిధ ఉపా ధ్యాయ సంఘాలు, విద్యావేత్తలు వేర్వేరుగా పత్రి కా ప్రక టనలు విడుదల చేశారు. రాష్ట్రానికి ప్ర త్యేక ఆర్థిక సాయంగా రూ.15 వేల కోట్లను కేటాయించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. అధిక శాతం మంది ఉద్యోగులు పన్ను చెల్లించే పాత ట్యాక్స్ విధానంలో ఎటువంటి మార్పులు తీసుకురాకపోవడం నిరాశ కలిగించిందని ఎస్టీ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కేఆర్ పవన్ కుమార్ అన్నారు. విద్యారంగానికి కేవలం 3.25 శాతం నిధులు కేటాయించడం విచారకరమని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, రెడ్డిదొర అన్నారు. ఉద్యోగుల స్టాండర్డ్ డిడక్షన్ రూ.75 వేలకు పెంపు, ఫ్యామిలీ పెన్షన్ రూ.25 వేలకు పెంచడాన్ని స్వాగతిస్తున్నామని అపుస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంబీఎస్ శర్మ అన్నారు.

● ఏలూరు కార్పొరేషన్ : బడ్జెట్‌లో ఉపాధి హామీకి రూ.86 వేల కోట్లు కేటాయించడమంటే వ్యవసాయ కార్మికులు, పేదలు, బలహీన వర్గాలకు తీరని అన్యాయం చేయడమేనని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రా మకృష్ణ అన్నారు. బడ్జెట్‌లో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్‌కి ప్రాధాన్యత ఇవ్వకపోవడం వలన పేదలకు భారీ నష్టం జరుగుతుందన్నారు.

● రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలకు సంబంధించి నిధులు కేటాయించలేదని సీపీఐ రాష్ట్ర నాయకులు బండి వెంకటేశ్వరరావు అన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీగాని, విశాఖ రైల్వే జోన్‌గాని ప్రస్తావన లేదన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి, నిర్వాసితులకు, ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలుకు కేంద్ర బడ్జెట్‌లో స్పష్టత లేదన్నారు.

● బడ్జెట్ రైతాంగాన్ని తీవ్ర నిరాశకు గురిచేసిందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. 48 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌లో వ్యవ సాయం, దాని అనుబంధ రంగాలకు కేవలం రూ.లక్షా 52 వేల కోట్లు కేటాయించడం తగదన్నారు. వ్యవసాయ రంగానికి కనీసం పది శాతం నిధులు కేటాయించాల్సి ఉందన్నారు. బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉందన్నారు.

● ఏలూరు రూరల్ : వికసిత్‌భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ ఉందని, వివేకానంద ప్రజాహిత రక్షణ సమితి అధ్యక్షుడు కోలాభాస్కర్ రావు అన్నారు. అన్నివర్గాల ప్రజలకు మేలుచేసే విధంగా బడ్జెట్ ఉందన్నారు.

● బుట్టాయగూడెం : బడ్జెట్ పేదలకు ఏమాత్రం ఉపయోగపడదని మాజీ ఎంపీటీసీ, న్యాయవాది యు.ఏసుబాబు అన్నారు. బడ్జెట్ పేదలను, నిరుద్యోగులను తీవ్ర నిరాశ పరచిందన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయింపు హామీ బడ్జెట్‌లో లేదన్నారు.

● ఉంగుటూర : ఎన్డీఏ ప్రభుత్వం అమరావతి అభివృద్ధికి కట్టుబడి ఉందని, కేంద్రం రాష్ట్రంపై వరాలు జల్లు కురిపించిందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

● జంగారెడ్డిగూడెం : కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు రాష్ట్ర పురోగతికి ఎంతగానో ఉపయోగపడతాయని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్రశేషు అన్నారు. రాష్ట్రంలో వెనుక బడిన జిల్లాలకు ప్రత్యేక నిధుల కేటాయించడంపై శేషు హర్షం వ్యక్తం చేశారు.

● భీమడోలు : రాష్ట్రాభివృద్ధికి, అమరావతి నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించడంపై మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. భీమడోలు క్యాంపు కార్యాలయంలో మంగళవారం ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. అమరావతికి రూ.15 వేల కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు. పోలవరం సత్వర నిర్మాణానికి సంపూర్ణ సాయం, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కేటాయించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. నాయకులు పెద్దిరాజు, పుల్లయ్యనాయుడు, శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

శుభపరిణామం : ఎమ్మెల్యే ధర్మరాజు

అమరావతికి రూ.15 వేల కోట్లు కేటాయించడం, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి సంపూర్ణ సహకారం అందిస్తామనడం ఎన్డీఏ చిత్తశుద్ధికి నిదర్శనమని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేక స్థానం ఇచ్చారని హర్షం వ్యక్తం చేశారు.


భీమడోలు క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతున్న వీరాంజనేయులు

● జంగారెడ్డిగూడెం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఆశాజనకంగా ఉందని పట్టణ బీజేపీ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు అన్నారు. ఏపీ పునర్విభజన చట్టంలోని హామీలను నెరవేర్చడానికి కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తుదని, రాజధానికి రూ.15 వేల కోట్లను కేటాయించడం పట్ల హర్షణీయమన్నారు.

● కామవరపుకోట : కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రీఆర్గనైజేషన్ యాక్టు ప్రకారం రాష్ట్ర పునర్నిర్మాణం కోసం రూ.15 వేల కోట్లు కేటాయించడం అభినందనీమని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఒంటెద్దు యేసువరప్రసాద్ అన్నారు. పోలవరం ప్రాజెక్టు బాధ్యత కేంద్రమే వహిస్తామని చెప్పడం శుభ పరిణామన్నారు. .

● కామవరపుకోట : పేదరిక నిర్మూలన దిశగా బడ్జెట్ ఉందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో అమరావతికి రూ.15 వేల కోట్లు కేటాయించడం శుభపరిణామని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణఅన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి కేంద్రం ప్రాధాన్యత ఇచ్చింది. ఇదంత కూటమి ప్రభుత్వం సాధించిన విజయమేనని పేర్కొన్నారు.

● లింగపాలెం :ఏపీకి బడ్జెట్‌లో వేల కోట్లు కేటాయించడం శుభపరిణా మమని మండల బీజేపీ అధ్యక్షుడు కుర్రా సుబ్రహ్మణ్యేశ్వరవర ప్రసాద్ అన్నారు. ధర్మాజీగూడెంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు.


వరద దాటికి వేలేరుపాడు మండలం కమ్మరగూడెం గ్రామం పరిస్థితి..


పోలవరం కడమ్మ స్లూయిజ్ వద్ద వరద జలాలు


దాచారం పునరావాస కాలనీలో భోజన ఏర్పాట్లు


కుక్కునూరు మండలం చివ్వాక ఆయకట్టు ప్రాంతంలో నీట మునిగిన వరినాట్లు

అక్కడ తగ్గి.. ఇక్కడ పెరిగి..

ముంపులోనే పొలాలు.. డ్రెయిన్లకు గండ్లు

అధికారుల నిర్లక్ష్యం.. డ్రెయినేజీ ఈఈపై వేటు

సస్పెండ్ చేసిన జిల్లా కలెక్టర్ నాగరాణి

ముంపు చేలను పరిశీలించిన నిపుణుల బృందం

కొత్తగా సాగు చేసుకోవాలంటూ సూచన

విత్తనాలు సిద్ధంగా ఉంచిన వ్యవసాయ శాఖ

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పంట పొలాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. ఎర్రకాల్వ వరద పశ్చిమ గోదావరి జిల్లాలో తీవ్ర ప్రభావం చూపింది. తాడేపల్లిగూడెం రూరల్ మండలంలో వేలాది ఎకరాల్లో పంట దెబ్బతింది. యనమదుర్రు డ్రెయిన్‌లోకి వచ్చే కాలువలు ఎగదన్నాయి. దాని ప్రభావంతో యండగండి, భీమవరం పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు ముంపుబారిన పడ్డాయి. వరద ప్రాంతాల్లో మంగళవారం నిపుణుల బృందం పర్యటించింది. కొత్తగా సాగు చేసుకోవాలని సూచించింది. నాట్లు కనిపిస్తున్నా సరే పంట ఎదిగే పరిస్థితి ఉండదని తేల్చింది. ముంపు వీడిన తర్వాత మళ్లీ కొత్త సాగుకు సిద్ధం కావాలని దిశానిర్దేశం చేసింది. గుంటూరు నుంచి విచ్చేసిన డైరెక్టర్ ఆఫ్ రీసెర్చర్స్ సైతం జిల్లాలో పర్యటించారు. స్వల్పకాలిక రకాలను సాగు చేసుకుంటే జనవరి నాటికి మళ్లీ రబీకి సిద్ధం కావచ్చంటూ వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచనలు చేశారు. ఎంటీయు 1153, ఎంటీయు 1156, పీఆర్ 126 రకాలు మళ్లీ సాగు చేసుకోవాల్సి ఉంటుంది. రాయితీ ద్వారా రైతులకు సరఫరా చేయడానికి వ్యవసాయ శాఖ కసరత్తు చేస్తోంది. వ్యవసాయ శాఖ కమిషనర్‌కు ఆ దిశగా లేఖ రాసింది.

గోస్తనీకి గండి.. ఈఈ సస్పెన్షన్

గోస్తనీ డ్రెయిన్‌కు గండి పడడంతో పాలకోడేరు మండలంలో వేలాది ఎకరాలు ముంపు బారినపడ్డాయి. దానికి డ్రైనేజీ అధికారులు నిర్లక్ష్యం కారణమైంది. గండి పడకుండా చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారు. పర్యవేక్షణ కొరవడింది. ఫలితంగా డ్రైనేజీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిశోర్‌ను జిల్లా కలెక్టర్ నాగరాణి సస్పెండ్ చేశారు. సరైన ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే పాలకోడేరు మండలం మోగల్లు వద్ద గోస్తనీ డ్రెయిన్‌కు గండిపడింది.

కలెక్టర్ పర్యటన

గోదావరి వరద పెరుగుతుండడంతో లంక గ్రామాల ప్రజలకోసం పునరావాస కేంద్రాలను నెలకొల్పారు. జిల్లా కలెక్టర్ నాగరాణి గోదావరి ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఎగువ ప్రాంతంలో వర్షాలు కురుస్తుండడంతో గోదావరికి వరద పెరిగే అవకాశం ఉందని అధికారులను అప్రమత్తం చేశారు. విధుల్లో అలసత్వం వద్దంటూ హెచ్చరించారు.


గోస్తనీ డ్రెయిన్‌కు గండి పడడంతో పాలకోడేరులో మునిగిన వరి పొలాలు

వరద తగ్గినా ముంపులోనే గ్రామాలు..చేలు

భద్రాచలం వద్ద గోదారి నీటిమట్టం నెమ్మదిగా తగ్గుముఖం పట్టింది. ఉదయం 51.6 అడుగుల నీటిమట్టం ఉండగా సాయంత్రం 5 గంటలకు 50.9 అడుగులకు తగ్గింది. తెలంగాణ ఎగువ ప్రాంతంలో వర్షాలు లేకపోవడంతో ప్రస్తుతం వరద భయం వీడింది. వరద నీటిని భారీగా దిగువకు విడుదల చేస్తుండడంతో సిద్ధాంతం, ఆచంట, యలమంచిలి తీర గ్రామాలకు వరద నీరు పోటెత్తుతోంది. 15 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల అవడంతో నరసాపురం వద్ద వశిష్ఠ గోదావరి ఉరకలు వేస్తోంది.


పడవలపై రాకపోకలు సాగిస్తున్న కనకాయలంక గ్రామస్థులు

శాంతించిన ఎర్రకాలువ

గ్రామాల్లో పారిశుధ్య చర్యలు.. నీటిలోనే వరి పొలాలు

తగ్గుముఖం పట్టిన వయ్యేరు

తాడేపల్లిగూడెం రూరల్/తణుకు : ఐదు రోజులుగా ఉగ్రరూపం దాల్చిన ఎర్రకాల్వ మంగళవారం కాస్తంత శాంతించింది. మండలంలోని జగన్నాధపురం, మారంపల్లి, మాధవరం, వీరంపాలెం, అప్పారావుపేట, పట్టింపాలెం, ఆరుళ్ల గ్రామాల్లోకి చేరిన వరదనీరు వెనక్కి మళ్లింది. దీంతో ఆయా గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది సూపర్ శానిటేషన్ చర్యలు చేపట్టారు. పంటచేల నుంచి వరదనీరు తగ్గకపోవడంతో వరిపంటపై రైతులు ఆశలు వదులుకున్నారు. మండలంలో సుమారు 1,500 ఎకరాల వరిపంట నష్టానికి గురైంది. వయ్యేరు కాలువ వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. దువ్వ వయ్యేరు అక్విడెక్టు వద్ద ఒకటిన్నర అడుగులు నీటి మట్టం తగ్గి 13 అడుగులకు చేరింది. దీంతో పొలాల్లో చేరిన వరద నీరు క్రమంగా తగ్గుతోంది. తణుకు మండలంలోని ముద్దాపురం, కోనాల, దువ్వ, తేతలి, మండపాక, వడ్లూరు గ్రామాల్లో వరిచేలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గత ప్రభుత్వంలో మురుగు కాలువలు, పంట కాల్వలు పూడికతీత పనులు చేయక పోవడంతోనే ఇలాంటి దుస్థితి ఎదుర్కోనాల్సి వచ్చిందని పలువురు రైతులు వాపోతున్నారు. మూడు వేల పైగా ఎకరాలు నీటిలోలే మునిగి ఉన్నాయి. నీట మునిగిన ప్రాంతాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు సందర్శించారు. అలాగే పునరావ కేంద్రంలో ఉన్న వారికి అన్ని వసతులు కల్పించారు.


నందమూరు పాఠశాల వద్ద బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

లంక గ్రామాల్లోకి వరద

పడవల్లో రాకపోకలు

నరసాపురం వద్ద వశిష్ఠ ఉగ్రరూపం

మూడో రోజు రాకపోకలు బంద్

ముందస్తుగా 10 వేల ఇసుక బస్తాలు రెడీ



ఆచంట/యలమంచిలి/నరసాపురం జూలై 23: వశిష్ఠ గోదావరి మంగళవారం ఉగ్రరూపం దాల్చింది. పెదమల్లం మాచేనమ్మ ఆలయ సమీపంలోకి వరదనీరు చేరుతుంది. ఇప్పటికే మండలంలో ఉన్న పుష్కరఘాట్‌లు పూర్తిగా నీట మునిగాయి. వరద పరిస్థితిని తహసీల్దార్ ఐపిశెట్టి , ఎంపీడీవో నరసింహ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు సమీక్షిస్తున్నారు. కనకాయలంక కాజ్‌వే రెండురోజులుగా వరదనీటిలోనే ఉంది. కనకాయలంక గ్రామస్తులు పడవలలో రాకపోకలు సాగిస్తున్నారు. లంకగ్రామాలైన కనకాయలంక, పెదలంక, లక్ష్మీపాలెం, యలమంచిలిలంక, బాడవ గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లోకి వరద నీరు చేరుతోంది. దొడ్డిపట్ల, లక్ష్మీపాలెం గ్రామాల్లోని పల్లిపాలెం ప్రాంతాల్లో ఇళ్లచుట్టూ వరదనీరు ప్రవేశిస్తోంది. అబ్బిరాజుపాలెం, గంగడపాలెం, బూరుగుపల్లి, యలమంచిలి, చించినాడ, ఏనుగువానిలంక గ్రామాల్లో లంక భూములు నీట మునిగాయి. నరసాపురం వద్ద వశిష్ఠ గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఎగువ నుంచి 15 లక్షల క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టడంతో ప్రవాహం ఎక్కువగా ఉంది. మూడో రోజు మంగళవారం కూడా ఉభయ గోదావరి జిల్లాల మధ్య రాక పోకల్ని నిలిపి వేశారు. అమరేశ్వర, వలంధర్, బాపుఘాట్‌ల మెట్ల పైభాగం వరకు వరద నీరు చేరింది.పొన్నపల్లి, నందమూరికాలనీలో వరద నీరు వచ్చే అవకాశం ఉండటంతో ముందస్తుగా నీటిని తోడేందుకు మోటర్లు ఏర్పాటు చేశారు. నాలుగు రోజులుగా వరద ప్రవాహానికి గట్లు బలహీన పడుతుం డటంతో వాటిని పటిష్ఠ పర్చేందుకు ఇసుక బస్తాలను సిద్ధం చేస్తున్నారు. ఏటిగట్టు శాఖ అధికారులు ముందుస్తుగా 10 వేల బస్తాలను రెడీ చేసి యలమంచిలి, దొడ్డిపట్ల, కరుగోరుమిల్లి, పీచుపాలెం వద్దకు తరలించారు. ఆర్డీవో అంబరీష్ ఏటిగట్టలను పర్యవేక్షించి అధికారులతో సమీక్ష నిర్వహిం చారు. తహసీల్దార్ ప్రసాద్, కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏఈ సుబ్బారావు ఆయన వెంట ఉన్నారు.


లక్ష్మీపాలెంలో వరద పరిస్థితిని పరిశీలిస్తున్న నరసాపురం ఆర్డీవో అంబరీష్

లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీవో అంబరీష్

వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని నరసాపురం ఆర్డీవో అచ్యుత అంబరీష్ సూచించారు. యలమంచిలి మండలంలోని బాడవ, లక్ష్మీపాలెం గ్రామాల్లో, వడ్డిలంక నక్కల అవుట్‌ఫాల్ స్లూయిజ్ వద్ద వరదపరిస్థితిని ఆర్డీవో పరిశీలించారు. లంక గ్రామాల్లో భోజన, వసతులు, తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వైద్యశిబిరాల వద్ద అన్నిరకాల మందులు, వ్యాక్సిన్‌లు అందు బాటులో ఉంచాలన్నారు. తహసీల్దారు విజయశ్రీ ఉన్నారు.


నరసాపురంలో సిద్ధం చేస్తున్న ఇసుక బస్తాలు


దువ్వలో పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు,రైతులు

గోదావరి తగ్గుముఖం

కుక్కునూరు/వేలేరుపాడు, జూలై 23: గోదావరి వరద మంగళవారం సాయంత్రం నుంచి తగ్గుముఖం పట్టింది. ఉదయం భద్రాచలం వద్ద 51.9 అడుగులకు చేరుకుని మధ్యాహ్నం తరువాత వరద ప్రవాహం నిలకడగా ఉంది. సాయంత్రానికి ఒక అడుగు మేర తగ్గి క్రమేపీ తగ్గుతూ వస్తుంది. గోదావరి ముంపుతో చివ్వాక చెరువు ఆయకట్టు ప్రాంతంలో వరినాట్లు నీట మునిగాయి. పలు గ్రామాల శివారులోకి వరద ముంచుకొచ్చింది. దాచారం, కౌండిన్యముక్తి, కివ్వాక పునరావాస కేంద్రాల్లో ప్రభుత్వ అధికారులు భోజన ఏర్పాట్లు చేశారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో జంగారెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య స్థానిక తహసీల్దార్లు, ఎంపీడీవోతో కలిసి పర్యటించారు. బాధితుల కోసం 18 బోట్లు 12 జనరేటర్లు సిద్ధంగా ఉంచామన్నారు. రెండు లాంచీల ద్వారా నిత్యావసర వస్తువులైన కూరగాయలు, వాటర్ ప్యాకెట్లు, టార్పాలిన్లు, దోమల చక్రాలు, కొవ్వొత్తులు, బియ్యం, వరద బాధితులకు పంపిణీ చేశారు. వేలేరుపాడు మండలంలో జల దిగ్బంధంలో చిక్కుకున్న గ్రామాలకు అధికారులు పడవలు ఏర్పాటు చేయడంతో అత్యవసర సేవలకు ప్రజలు వాటిని ఉపయోగించుకుంటున్నారు. ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు నిత్యావసర సరుకులు బియ్యం, కూరగాయలను ఆయా గ్రామాల్లో పంపిణీ చేస్తున్నారు. గుట్టలపై గుడిసెలు వేసుకున్న రుద్రంకోట, కొయిదా, చిగురుమామిడి, నాళ్ళవరం, గ్రామాల్లోని ప్రజలకు 500 టార్పాలిన్‌లను పంపిణీ చేశారు.

11.87 లక్షల క్యూసెక్కుల జలాలు విడుదల

పోలవరం, జూలై 23 :పోలవరంలో గోదావరి నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. మంగళవారం సాయంత్రానికి పోలవరంలో గోదావరి నీటిమట్టం 25 మీటర్లకు చేరుకుంది.ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉప నదుల నుంచి వస్తున్న వరద జలాలను స్పిల్వే 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. మంగళవారం 11,87,497 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేసినట్లు ఈఈ మల్లిఖార్జునరావు, డీఈ మాధవరావు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 33.600 మీటర్లు, స్పిల్వే దిగువన 25.350 మీటర్లు నమోదైనట్లు తెలిపారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 51.20 అడుగులకు చేరుకోవడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం పెరగడంతో 175 గేట్లు ఎత్తి 12 లక్షల క్యూసెక్కుల జలా లను సముద్రంలోకి విడుదల చేశారు. ధవళేశ్వరం వద్ద 14.05 మీటర్ల నీటిమట్టం నమోదైందని రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు ధవళేశ్వరం బ్యారేజి డీఈఈ రమేశ్ తెలిపారు.

ప్రాజెక్టుకు రాకపోకలు బంద్

భద్రాచలం వద్ద నీటిమట్టం స్వల్పంగా తగ్గుతున్న నేపథ్యంలో పోలవరంలో గోదావరి నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి అనూహ్యంగా పెరిగింది. కడెమ్మ స్లూయిజ్ వద్ద భారీ వరద జలాలు నిలిచాయి. పోలవరం ప్రాజెక్టుకి రాకపోకలు సాగించే ప్రధాన మార్గమైన కడమ్మ వంతెన పూర్తిగా నీటమునిగి మూడు అడుగుల ఎత్తున జలాలు ప్రవహిస్తున్నాయి. దీంతో ప్రాజెక్టుకు రాకపోకలు పూర్తిగా బంద్ అయ్యాయి. ప్రాజెక్టుకి కార్మికులు, అధికారులు రాకపోకలు సాగించేందుకు పాండురంగడి కొండ పక్క నుంచి మూలలంక మీదుగా ప్రత్యామ్నాయ మార్గాన్ని అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.ఏటిగట్టుకి కుడివైపున ఉన్న పంటపొలాల్లో కొండవాగుల జలాలు నిలిచి సుమారు రెండు వేల ఎకరాల్లో వరినాట్లు నీట మునిగాయి.

కొనసాగుతున్న వర్షాలు

కుక్కునూరు మండలంలో 32.8 మి.మీ వర్షపాతం

ఏలూరుసిటీ, జూలై 23: నైరుతి రుతుపవనాల ఉధృతితో జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా కుక్కునూరు మండలంలో 32.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా సరాసరి వర్షపాతం 3.1 మి.మీ నమోదైంది. వేలేరుపాడులో 26.2, పోలవరంలో 4.8, దెందులూరులో 4.2, కామవరపుకోటలో 3.8, నూజివీడులో 2.8, బుట్టాయిగూడెం మండలంలో 2.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. మంగళవారం కూడా పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది.

ముంపులో 5,423 హెకార్లు

భారీ వర్షాలు, వరదల కారణంగా ఏలూరు జిల్లాలో 5,423 హెక్టార్లలో వివిధ పంటపొలాలు ఇంకా నీటి మునిగే ఉన్నాయి. వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం 194 హెక్టార్లలో వరి నారుమళ్లు, 5,250 హెకార్టలో వరి నాట్లు వేసిన పంట పొలాలు ముంపులోనే కొనసాగుతున్నాయి. ఐదు హెక్టార్లలో మొక్కజొన్న, 168 హెక్టార్లలో ప్రత్తి పంట నీటి మునిగే ఉన్నాయి. వర్షాలు కురవడం, పంట పొలాల్లో నీరు తీయక పోవడంతో పంటలు కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గోదారి వరదలో లచ్చిగూడెం

ఏటా 3 నెలలపాటు కొండగట్టు పైనే జీవనం

గుట్టల పైకి చేరుకుంటున్న గిరిజనులు

ముంపు గ్రామాల జాబితాలో చేర్చండి


గుట్టల పైకి చేరుకున్న లచ్చిగూడెం గిరిజనులు

కుక్కునూరు, జూలై 23: కుక్కునూరు మండలంలో మారుమూల గ్రామం లచ్చిగూడెం. గ్రామంలో 150 గిరిజన కుటుంబాలున్నాయి. ఈ గ్రామాన్ని మూడు వైపులా గోదావరి వరదనీరు చుట్టుముట్టింది. ప్రభుత్వం అందజేసిన టర్పాలిన్లు, కూరగాయలు తీసుకుని గుట్టలపైకి గిరిజనులు చేరుకుంటున్నారు. ఇప్పటికే తాత్కాలికంగా గుడిసెలు వేసుకున్నారు. అధికారులు గుట్టలపైన జనరేటర్ ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పిం చారు. తాగునీటి కోసం మంచినీటి ప్యాకెట్లు సిద్ధం చేశారు. ప్రతీ ఏటా ఇదే పరిస్థితి. దాదాపు మూడునెలల పాటు గోదావరి వరద తగ్గే వరకు అక్కడే జీవనం. గుట్టలపైనే వండుకుని, వరదనీరే వాడుకుంటూ దుర్భరమైన జీవనం సాగించడం అలవాటుగా మారింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 50 అడుగులకు చేరితే చాలు ఆ గ్రామాన్ని వరదనీరు చుట్టుముడుతుంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా 41.15 కాంటూరు లెవిల్‌లో ప్రభుత్వం ప్రకటించిన ముంపు గ్రామాల జాబితాలో లచ్చిగూడెం లేక పోవడం గమనార్హం. ముందే ముంపుకు గురవుతున్న తమ గ్రామం ముంపు జాబితాలో లేకపోవడంపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామాన్ని ముంపు జాబితాలో చేర్చి పునరావాస పరిహారం, వ్యక్తిగత పరిహారం చెల్లించి పునరావాస కాలనీకి తరలించాలని కోరుతున్నారు.

ముంపు గ్రామాల్లో చేర్చండి



మా గ్రామాన్ని ముందే వరదనీరు చుట్టుముడుతుంది. ప్రతీ ఏటా ఇదే పరిస్థితి. ఎటు వెళ్ళడానికి కూడా వీలులేని పరిస్థితి. గోదావరి తగ్గిన తరవాత ఇళ్లకు చేరుకుంటున్నాం. పునరావాస పరిహారం చెల్లించి మమ్మల్ని ఆదుకోవాలి.
- సున్నం అమ్ములు, లచ్చిగూడెం

ఏటా గుట్టలపైనే



ప్రతీ ఏటా వర్షాకాలం సీజన్ వస్తేనే మాకు భయాందోళనలకు గురవు తున్నాం. గుట్టల పైన జీవించే క్రమంలో గ్యాస్ ఉండదు. దీంతో కట్టెల పొయ్యి మీదే వండుకుని తినాలంటే కష్టంగా మారిది. అధికారులు మా బాధ అర్థం చేసుకోవాలి **- మచ్చా సుభద్ర, లచ్చిగూడెం**

ఉమ్మడి జిల్లా పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన పోటీ

ఏలూరు అర్బన్, జూలై 23 :ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు జిల్లా స్థాయి వ్యాసరచన పోటీని నిర్వహిస్తున్నట్టు మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు ఓ ప్రకటనలో తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై రెండు పేజీలకు మించకుండా వ్యాసం రాసి స్కూలు హెచ్ఎం ధ్రువీకరణతో ఆగస్టు 10వ తేదీలోగా ' కార్యదర్శి, జిల్లా సర్వోదయ మండలి, గాంధీ కస్తూరిబా భవనం, శ్రీరాంపురం, భీమవరం-2 ' చిరునామాకు పోస్టులో పంపాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పోటీలో పాల్గొనవచ్చునని తెలిపారు.

క్రైం కార్నర్

వివాహిత ఆత్మహత్య

పెంటపాడు, జూలై 23 : పెయింట్‌లో వాడే టిన్నర్‌ను ఒంటిపై వేసుకుని నిప్పు అంటించుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని ప్రత్తిపాడులో చోటుచేసుకుంది. ప్రత్తిపాడు జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న గోనా అరుణకుమారి (28) మంగళవారం తన ఇంటి వద్ద ఒంటిపై టిన్నర్ వేసుకుని నిప్పు అంటించుకుంది. ప్రమాదకర పరిస్థితిలో ఉన్న ఈమెను స్థానికులు తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందింది. మృతురాలికి భర్త పండు, ఇద్దరు కుమారులు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని రూరల్ సీఐ రమేష్ పరిశీలించారు.

రైలు ఢీకొని బిహార్ వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, జూలై 23 : రైలు ఆగిందని బిహార్‌కు చెందిన ఒక వ్యక్తి రైలు దిగి టాయిలెట్‌కు వెళ్లేందుకు పక్కనే ఉన్న పట్టాలు దాటుతుండగా మరో రైలు వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బిహార్‌కు చెందిన వినోద్ బహర్‌దార్ (39) బెంగుళూరులో కూలి పనులు చేసుకునే నిమిత్తం బెంగుళూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో వెళుతున్నాడు. ఈ నెల 22వ తేదీ అర్ధరాత్రి ఏలూరు నుంచి విజయవాడ వెళ్తున్న ఆ రైలు ఏలూరు సమీపంలోని కలపర్రు రైల్వేగేటు సమీపంలో ఎవరో చైన్ లాగడం వల్ల ఆగిపోయింది.రైలు ఆగింది కదా అని రైలు నుంచి దిగి పట్టాలు దాటుతుండగా ప్రమాదం జరిగింది. ఏలూరు రైల్వే పోలీసులు పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. రైల్వే ఎస్ఐ సైమన్ దర్యాప్తు చేస్తున్నారు.


యలమంచిలి లంక గ్రామంలో గోదావరిలో గల్లంతైన వ్యక్తి కోసం గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

గల్లంతైన వ్యక్తి కోసం గోదావరిలో గాలింపు

యలమంచిలి, జులై 23: యలమంచిలిలంక గ్రామంలో సోమవారం ప్రమాద వశాత్తు గోదావరిలో గల్లంతైన పితాని ఆనందరావు (43) కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందం గోదావరిలో మంగళవారం గాలింపు చర్యలు కొనసాగించారు.మంగళవారం సాయంత్రం వరకూ గాలించినప్పటికీ ఆచూకీ లభించ లేదు. చీకటి పడటంతో గాలింపు నిలిపివేశారు.

ఇసుక లారీలు సీజ్

జంగారెడ్డిగూడెం, జూలై 23 : ఇసుక అక్రమ రవాణాపై పలు చోట్ల పోలీసులు దాడులు నిర్వహించారు. మండలంలోని దేవులపల్లి గ్రామం వద్ద లక్కవరం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. వాడపల్లి ఇసుక ర్యాంపులో ఇసుక లోడు చేసుకుని వారి దగ్గర ఉన్న వే బిల్లుల ప్రకారం ఒక లారీ గోపాలపురం మండలం రేగులగుంట వెళ్ళాల్సి ఉండగా మరో లారీ తాళ్లపూడి మండలం కొవ్వూరుపాడు వెళ్ళాలి. చింతలపూడి వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు.లక్కవరం ఎస్సై టి.సుధీర్ కేసు నమోదు చేశారు.



కమ్మరిగూడెం గ్రామస్థులకు సహాయం అందిస్తున్న రిటైర్డ్ ఎంఈవో జగన్మోహన్‌రావు, ఉపాధ్యాయులు

కమ్మరగూడెం వరద బాధితులకు ఉపాధ్యాయుల సాయం

లక్షా 50 వేలు విలువైన బియ్యం, నిత్యావసరాలు పంపిణీ

వేలేరుపాడు, జూలై 23: పెదవాగు ప్రాజెక్టుకు గండిపడటంతో ప్రాజెక్టు దిగువనే ఉన్న గ్రామం కమ్మరగూడెం గ్రామం పూర్తిగా ధ్వంసమైంది. సర్వస్వం కోల్పోయిన ఆ గ్రామస్థులకు ఉమ్మడి రాష్ట్రంలో ఇక్కడ పనిచేసిన అప్పటి ఎంఈవో జగన్‌మోహన్‌రావు, ఉపాధ్యాయులు కలిసి సుమారు లక్షా 50 వేల విలువైన బియ్యం, దుస్తులు, కూరగాయలు, నిత్యావసర సరుకులు, 30 వేలు నగదు అందించారు. మంగళవారం ఆ గ్రామానికి ట్రాక్టర్ల మీద అతి కష్టంగా వెళ్లి 250 కుటుంబాలకు వీటిని అందించారు. ఉపాధ్యాయులు హరిబాబు, కృష్ణారావు, సిద్దూ, రవిబాబు, జగదేశ్వరరావు, నాగేశ్వరరావు, వెంకటేష్, నాగలక్ష్మి, రోజాకుమారి, నోబుల్, విజయ్‌కుమార్, నరేష్ ఉన్నారు.

బడ్జెట్‌పై హర్షాతిరేకాలు

అన్ని రంగాలకు ప్రయోజనకరం..


మాట్లాడుతున్న నారగాని, రఫీబా

మండవల్లి జూలై 23 : కేంద్ర బడ్జెట్ అన్ని రంగాలవారికి ప్రయోజనకరంగా ఉందని మండవల్లి మండల టీడీపీ అధ్యక్షుడు నారగాని వీర వెంకట నాగేశ్వరరావు, కైకలూరు నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు రాఫీబా సంతృప్తి వ్యక్తం చేశారు. రైతుల కోసం వ్యవసాయ బడ్జెట్ సంతృప్తినిచ్చిందని అమరావతికి కేటాయింపులు, పోలవరానికి పూర్తి సహకారం వంటి అంశాలతో రైతులకు ఎంతో ఆనందం కలుగుతోందని వారు పేర్కొన్నారు.

చరిత్రాత్మకం..

చాట్రాయి: కేంద్ర బడ్జెట్‌లో రాజధాని అమరావతి నిర్మాణానికి రూ. 15 వేల కోట్లు, ఆంధుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు పూర్తికి సహాయం, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయింపు చారిత్రాత్మకం అని టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జగన్ పాలనలో సర్వనాశనమైన రాష్ట్రానికి పునర్వైభవం తెచ్చేందుకు కూటమి ప్రభుత్వ చేస్తున్న కృషికి ఈ కేటాయింపులు ఊతం ఇస్తాయని ఆనందం వ్యక్తం చేశారు. టీడీపీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి, జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడి, తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, మండల నాయకులు బొట్టు లక్ష్మణరావు, కలకొండ భాస్కరరావు, పలగాని దుర్గారావు, నోబుల్‌రెడ్డి, తల్లాడ శ్రీనివాసరావు తదితరులు కేంద్ర బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేశారు.

ఆగిరిపల్లి: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర పునః నిర్మాణం కోసం భారీగా నిధులు కేటాయిస్తున్నట్లుగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించటం హర్షణీయమని బీజేపీ నూజివీడు కన్వీనర్ జీఆర్కే రంగారావు అన్నారు. రాజధాని అమరావతి అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధుల కేటాయింపుపై నిర్మలా సీతారామన్‌తోపాటు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.

కైకలూరు: లోక్‌సభలో మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కైకలూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ వేంపాటి విష్ణు హర్షం వ్యక్తం చేశారు. అన్ని రంగాలకు మేలు చేకూరుతుందన్నారు. అమరావతికి రూ. 15 వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టును కేంద్రమే పూర్తిచేస్తామని చెప్పడం శుభపరిణామమన్నారు. పరిశ్రమల స్థాపనకు సహకారం అందించడం హర్షణీయమన్నారు.

కూలేందుకు సిద్ధంగా..

▸శిథిలావస్థలో ట్యాంక్‌లు ▸ఐదేళ్లలో నిర్వహణ శూన్యం ▸కలుషిత నీరే దిక్కు!

మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సరఫరా ట్యాంకులు శిథిలావస్థకు చేరాయి. తాగునీటి పథకాల నిర్వహణ ఐదేళ్లుగా గాలికొదిలేయడంతో బీటలు వారి, పెచ్చులూడి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంకుల తొలగింపులో అధికారుల నిర్లక్ష్యంతో ఎప్పుడు కూలిపోతాయోనని స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు.

ముసునూరు, జూలై 23: మండల వ్యాప్తంగా 60 ఓవర్ హెడ్ ట్యాంకులు ఉన్నాయి. వీటిలో గోపవరం, గోగులంపాడు, యల్లాపురం, ముసునూరు, రమణక్కపేట ట్యాంకులను సుమారు 30 ఏళ్ళ క్రితం నిర్మించారు. ట్యాంకులు, స్తంభాలు సైతం బీటలు వారి పెచ్చులూడి ఐరన్ బయటపడింది. ట్యాంక్‌ల పైకి ఎక్కేందుకు ఉన్న మెట్లు ధ్వంసమయ్యాయి. ఐరన్ నిచ్చెనలు తుప్పుపట్టి విరిగిపోయాయి. దీంతో ఈ ట్యాంక్‌ల నుంచి వచ్చే కలుషిత నీరే ప్రజలకు దిక్కవు తోంది. అయితే గత ప్రభుత్వ పాలనలో ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజినీరింగ్ అసిస్టెం ట్లు వీటి నిర్వహణ గురించి పట్టించుకోవడం వల్ల మంచినీటి సరఫరా ట్యాంకుల పరిస్థితి మరింత అధ్వానంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను తొలగించి కొత్త ట్యాంక్‌ల నిర్మాణానికి జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


గోపవరం బీసీ కాలనీలో శిథిలావస్థకు చేరిన ట్యాంక్ (ఇన్‌సెట్) యల్లాపురం ట్యాంక్ స్తంభంలో బయటపడిన ఐరన్

ట్యాంక్‌ల నిర్మాణానికి చర్యలు...

మండలంలో కొన్ని గ్రామాల్లో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు శిథిలావస్థకు చేరడం వాస్తవమే. అయితే జలజీవన్ మిషన్ పథకంలో నూతన ట్యాంక్‌ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పాత ట్యాంక్‌లను తొలగించి, నూతన ట్యాంక్‌ల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటాం.
- కె.సత్యప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ముసునూరు మండలం.

గంజాయి నిరోధానికి..
ప్రత్యేక బృందాలు : డీఎస్పీ



నూజివీడు, జూలై 23: నూజివీడులో గంజాయి అమ్మకాల నిరోధానికి ప్రత్యేక టీంలు ఏర్పాటు చేస్తున్నట్లు నూజివీడు డీఎస్పీ జి.లక్ష్మయ్య తెలిపారు. 'గంజాయ్' శీర్షికన ఆంధ్రజ్యోతి మంగళవారం ప్రచురించిన కథనంపై ఆయన స్పందించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం గంజాయి అమ్మకాలపై ప్రత్యేక దృష్టిసారించిందని, ఏలూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి నిరోధానికి ప్రత్యేక 'డ్రైవ్'లు నిర్వహించనున్నట్లు తెలిపారు. కళాశాలల్లో అవేర్‌నెస్ క్యాంప్‌లు నిర్వహిస్తామని, 'యువత' ఎక్కడికి వెళ్ళి వీటి బారిన పడుతున్నారో అక్కడికి వెళ్ళి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, అమ్మకందారుల పై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులతో మాట్లాడి, గంజాయి సేవించే విద్యార్థులు ఉంటే, వారి ప్రవర్తనను తమ దృష్టికి తెవాలని చెప్పామన్నారు. మంగళవారం నూజివీడులోని మందుల షాప్‌ల నిర్వాహకులతో పోలీసులు సమావేశమై ప్రిస్క్రిప్షన్ లేకుండా, మత్తు కలిగించే మందులు కాని, ఇంజక్షన్‌లు కాని అమ్మవద్దని హెచ్చరించారు.

క్రైం సమాచారం

పారిశుధ్య పనులకు వెళ్తూ కార్మికురాలి మృతి

కలిదిండి, జూలై 23 : రోడ్డు ప్రమాదంలో పారిశుధ్య కార్మికురాలు మృతి చెందింది. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం కోమలూరుకు చెందిన శింగంశెట్టి సామ్రాజ్యం (23) ఆమె భర్త బైక్‌పై మంగళవారం కొండంగి పంచాయతీలో పారిశుధ్య పనులకు వెళ్తుండగా, కొండంగి సమీపంలో ఉప్పుటేరు వెంబడి రహదారిపై ఎదురుగా వస్తున్న ట్రక్కు ఆటో ఢీకొట్టింది. దీంతో సామ్రాజ్యం అక్కడికక్కడే మృతి చెందింది. భర్త సుబ్రహ్మణ్యంకు స్వల్ప గాయాలయ్యాయి. ట్రక్కు ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఎస్ఐ ప్రియకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి జాలరి..

ఆగిరిపల్లి, జూలై 23: చేపలు పట్టేందుకు వెళ్లిన జాలరి నీట మునిగి మృతి చెందాడు. ఆగిరిపల్లి మండలం శోభనాపురం గ్రామంలో గల కంబాల చెరువులో చేపలు పట్టేందుకు ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం చిన నందిగామ గ్రామం నుంచి 15 మంది జాలర్లు వచ్చారు. వీరిలో బలుసు స్వామి (63) చెరువులో దిగి వల వేయటానికి లోపలికి వెళ్ళిన క్రమంలో ఊపిరాడక మరణించినట్టు తోటి జాలర్లు తెలిపారు. కేసు నమోదు చేసి ఎస్సై సురేంద్రకుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో బాలుడు..

మండవల్లి జూలై 23 : మండలంలోని చింతలపూడి గ్రామంలో బాలుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందడంతో మంగళవారం మండవల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. గుడివాడ సమీపంలోని ఇందుపల్లి గ్రామానికి చెందిన మోకా ఓంకార్ తన కుటుంబ సభ్యులతో కలసి చింతలపూడి గ్రామంలోని రొయ్యల చెరువుపై వాచ్‌మన్‌గా పనిచేసేందుకు వచ్చాడు. సోమవారం సాయంత్రం ఓంకార్ మేకల కాపలాకు వెళ్లిన సమయంలో రొయ్యల చెరువుకు ఏరియేటర్స్ వేసేందుకు ఓంకార్ పెద్దకుమారుడు దుర్గారావు(14) చేంజ్ ఓవర్ ఆన్ చేయగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో అతనిని గుడివాడ ఆసుపత్రికి తరలించగా సోమవారం రాత్రి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు మండవల్లి పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

టీడీపీ బ్యానర్, బైక్ దహనం



నూజివీడు టౌన్, జూలై 23: నూజివీడు మండలం మర్సపూడి గ్రామంలో ఆగంతకులు టీడీపీ బ్యానర్‌ను, ద్విచక్ర వాహనాన్ని దగ్ధం చేసిన ఘటన సోమవారం అర్ధరాత్రి జరిగింది. గ్రామ టీడీపీ నాయకుడు ఉపేంద్ర తెలిపిన వివరాల ప్రకారం తన ఇంటి బయట ఏర్పాటు చేసిన బ్యానర్‌కు, ఇంటి లోపల ఉన్న ద్విచక్ర వాహనానికి ఆగంతుకులు నిప్పు పెట్టారని అది గమనించి ఇంట్లోని వారు ద్విచక్రవాహనం మంటలను ఆర్పినట్లు తెలిపారు. ఈ ఘటనపై నూజివీడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఉపేంద్ర తెలిపారు.

పరస్పరం దాడులు.. నలుగురిపై కేసు నమోదు

ముసునూరు, జూలై 23: ఇరు కుటుంబాలు పరస్పర దాడులు చేసుకున్న ఘటనలో నలుగురిపై ముసునూరు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ నాగభూషణరావు వివరాల ప్రకారం నూజివీడు మండలం ముక్కొల్లుపాడుకు చెందిన గుడ్డేటి నాగరాణికి ముసునూరు మండలం చింతలవల్లికి చెందిన పల్లిపాము రవికి ఐదేళ్ళ క్రితం వివాహమైంది. కొద్దిరోజులుగా నాగరాణిని ఆమె ఇంటి సమీపానే ఉంటున్న ఆమె మేనత్త, మేనమామ చిత్రహింసలకు గురిచేస్తున్నారు. ఈ విషయాన్ని నాగరాణి తన తల్లిదండ్రులకు చెప్పడంతో ఈ నెల 21న ఆమె తండ్రి గుడ్డేటి బాబూరావు, అన్నయ్య గోపిరాజు నాగరాణి మేనమామ పల్లిపాము సుగుణరావు ఇంటికి వెళ్లి విషయం అడగడంతో వారి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో సుగుణరావు, అతని కుమారుడు వెంకటాద్రిబాబు నాగరాణి తండ్రి, అన్నయ్యలు కర్రలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఇరు వర్గాల వారు గాయపడడంతో నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నలుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.


తామరకొల్లులో ఉపాధ్యాయుల బోధన తీరు పరిశీలిస్తున్న డీఈవో

'భోజనం' రుచిగా ఉండాలి : డీఈవో

కైకలూరు జూలై 23 : విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. అబ్రహం అన్నారు. మంగళవారం కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కైకలూరు మండలం వేమవరప్పాడు, తామరకొల్లులో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తనిఖీలు నిర్వహించి 1వ తరగతిలో ఎంతమంది విద్యార్థులు ఉన్నదీ తెలుసుకుని వారి స్థాయికి తగినట్లు బోధన జరుగుతున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. విద్యార్థుల వర్కు బుక్‌లను పరిశీలించారు. కలిదిండి మండలం సానారుద్రవరం ప్రాథమికోన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. మండవల్లి మండలం పులపర్రు పాఠశాలను పరిశీలించి మాట్లాడుతూ పాఠశాలల్లో నీరు నిల్వలేకుండా జాగ్రత్తలు తీసుకుని బ్లీచింగ్, సున్నం చల్లించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

టెన్త్ ఉత్తీర్ణత శాతం పెంచాలి...

ముదినేపల్లి: పదవ తరగతి పరీక్షల్లో ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వ హైస్కూళ్ల ఉపాధ్యాయులు ఇప్పటి నుంచి కార్యాచరణ రూపొందించుకోవాలని డీఈవో అబ్రహం తెలిపారు. పెదగొన్నూరు, అల్లూరు జడ్పీ హైస్కూళ్లు, సింగరాయపాలెం యుపి పాఠశాలను మంగళవారం సందర్శించారు. పెదగొన్నూరు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ పరిశీలించి భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయండి : ఎంఈవో

ముదినేపల్లి, జూలై 23 : ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని ముదినేపల్లి ఎంఈవో కె.నరేష్ కుమార్ తెలిపారు. ముదినేపల్లిలోని మండల రిసోర్స్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెడు అలవాట్లు జోలికి పోకుండా, డ్రగ్స్, మద్యపానం, ఇతర మాదక ద్రవ్యాలను వినియోగించకుండా విద్యార్థుల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆరవ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉన్న ఉన్నత పాఠశాలల్లో, కళాశాలల్లో వెంటనే ఈ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని పాఠశాలల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారని ఎంఈవో నరేష్ కుమార్ తెలిపారు. హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలను కూడా టైం టేబుల్ ప్రకారం నిర్వహించాలన్నారు.


విచారణ చేస్తున్న డీఎల్పీవో చంద్రశేఖర్

నత్తగుల్లపాడు పంచాయతీపై విచారణ

రికార్డులు స్వాధీనం చేసుకున్న డీఎల్పీవో

కైకలూరు జూలై 23: పంచాయతీల్లో విధులు సక్రమంగా నిర్వహించకుంటే చర్యలు తప్పవని డివిజనల్ పంచాయతీ అధికారి కేపీ చంద్రశేఖర్ హెచ్చరించారు. మంగళవారం కైకలూరు మండలం నత్తగుల్లపాడు పంచాయతీపై అందిన ఫిర్యాదుల మేరకు విచారణ చేపట్టారు. పంచాయతీ సమావేశాలను సక్రమంగా నిర్వహించడంలేదని, కార్యదర్శి జె కుమారస్వామి విధులకు రావడం లేదని, గ్రామ సమస్యలను పట్టించుకోకుండా సర్పంచ్ ముంగర రామకృష్ణంరాజు సహా ఇద్దరూ అందుబాటులో ఉండడం లేదని ఉప సర్పంచ్ నబిగారి ఏడుకొండలతో పాటు వార్డు సభ్యులు, పలువురు గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన డీఎల్పీవో ఫిర్యాదు దారుల సమక్షంలో విచారణ చేసి పంచాయతీ రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపుతామని డీఎల్పీవో తెలిపారు. ఈవోపీఆర్డీ ఆర్. రవిశంకరరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బొమ్మినంపాడు సర్పంచ్, కార్యదర్శిపై ఫిర్యాదు



ముదినేపల్లి, జూలై 23 : బొమ్మినంపాడు పంచాయతీ పరిధిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పంచాయతీ ఉప సర్పంచ్ పాలంకి వెంకటేశ్వర రావు, 12 మంది పాలకవర్గ సభ్యులు కోరారు. మంగళవారం పంచాయతీకి సంబంధించిన వివిధ అంశాలపై ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ ఏరియాలో ఏ పనులు చేయకుండానే మట్టి పనుల పేరుతో బిల్లులు చేయించారు. దీనిపై సర్పంచ్‌ను, కార్యదర్శిని అడిగినా సమాధానం చెప్పటం లేదని ఫిర్యాదు చేశారు. గ్రామంలో గత మూడు నెలలుగా వీధి లైట్లు వెలగటం లేదని, నీటి కుళాయిలు పని చేయటం లేదని, పారిశుధ్యం లోపించిందని పాలకవర్గ సభ్యులు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. పై సమస్యలను సర్పంచ్ గానీ, కార్యదర్శి గానీ పట్టించుకోవటం లేదని పేర్కొన్నారు. పై అంశాలను పరిశీలించి విచారణ జరిపించాలని కోరారు. గ్రామంలో మురుగునీటి పారుదల సౌకర్యం లేక దోమల పెరిగి ప్రజలు అనారోగ్యంకు గురవుతున్నారని మెమొరాండంలో పేర్కొన్నారు.



చాట్రాయి మండలం తుమ్మగూడెం, ఆగిరిపల్లి సీతారాంపురంలోని పాఠశాలల్లో తిలక్, ఆజాద్ చిత్రపటాల వద్ద విద్యార్థుల నివాళి

తిలక్, ఆజాద్‌లకు నివాళులు

చాట్రాయి, జూలై 23: తుమ్మగూడెం ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వాతంత్ర్య సమర యోధులు బాల గంగాధర తిలక్, చంద్రశేఖర అజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. తిలక్, అజాద్ చిత్రపటాలకు విద్యార్థులు ఉపాధ్యాయుడు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారత జాతి స్వేచ్ఛ స్వాతంత్ర్యాల కోసం తిలక్, అజాద్ చేసిన పోరాటాలను హెచ్‌ఎం వెంకట్రావు విద్యార్థులకు వివరించారు. ఈ త్యాగ మూర్తుల స్ఫూర్తితో విద్యార్థులు చదువుల్లో రాణించి దేశానికి సేవ చేయాలని ఉద్బోధించారు.

ఆగిరిపల్లి: సీతారామపురం ఎంపీ యూపీ స్కూల్‌లో బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్, జయంతి వేడుకలు డీపీఆర్టీయూ మండల అధ్యక్షుడు, పాఠశాల హెచ్‌ఎం గరిక నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పిల్లలకు వారి జీవిత విశేషాలు వివరించి వారి స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. ఉపాధ్యాయులు సయ్యద్, జోసెఫ్, లక్ష్మి పాల్గొన్నారు.


పెదపాలపర్రులో రైతులకు రవాణా చార్జీలు అందజేస్తున్న మిల్లర్లు

టీడీపీ నాయకుడి చొరవతో..
రైతులకు రవాణా చార్జీల చెల్లింపు

ముదినేపల్లి, జూలై 23 : పెదపాలపర్రు పీఏసీఎస్‌లో 2021-22 సంవత్సరంలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన రవాణా ఛార్జీల చెల్లింపు సమస్య టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి చొరవతో పరిష్కారమైంది. రైతులకు రవాణా ఛార్జీల చెల్లింపులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం నుంచి విడుదలైన రవాణా ఛార్జీల సొమ్మును చెల్లించకుండా అప్పటి సంఘ అధ్యక్షుడు వాడుకున్నారని అప్పట్లో రైతులు సంఘం వద్ద ధర్నాలు చేశారు. దీంతో శోభనాద్రి చౌదరి అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, సివిల్ సప్లయిస్ అధికారులు విచారణ జరిపారు. రవాణా ఛార్జీలు రైతులకు అందలేదని గుర్తించారు. ఈ నేపథ్యంలో సుమారు 200 మంది రైతులకు మంగళవారం సుమారు రూ.3 లక్షల రవాణా ఛార్జీలను తొలి విడతగా మిల్లర్లు అందజేశారు. టీడీపీ నాయకుడు చల్లగుళ్ల ఆదిత్య, సర్పంచ్ గంటా రాకేష్, ఉపసర్పంచ్ గన్నమనేని వెంకటేశ్వరరావు తదితరుల సమక్షంలో రైతులకు రవాణా ఛార్జీలు చెల్లించారు. సంఘ కార్యదర్శి మల్లేశ్వరి పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ఏలూరు సిటీ, జూలై 23: జిల్లాలో వరద ప్రభావం పూర్తిగా తగ్గే వరకు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించామని జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి తెలిపారు. జిల్లాలో ఇటీవల కురిసిన భారీవర్షాలు, వరదలు కుక్కు నూరు, వేలేరుపాడు మండలాల్లో తీవ్ర ప్రభావాన్ని చూపాయన్నారు. వరదలకు 10 గ్రామాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, వివిధ శాఖలకు సంబంధించి రూ.187 కోట్ల మేర నష్టం వాటిల్లిందన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో వరద ప్రభావిత గ్రామాలలోని 6,311 మందిని 21 పునరావాస కేంద్రాలకు తరలించి భోజన, వసతి సౌకర్యాలు కల్పించామన్నారు. 231 ఇళ్ళు దెబ్బతిన్నాయన్నారు. 30 గొర్రెలు, పాడిపశువులు చనిపోయాయన్నారు. 5,305 హెక్టార్లలో పంట నష్టం కలిగిందని, 64 హెక్టార్లలో ఉద్యానవన పంటలు నీట మునిగాయన్నారు. 333 కిలోమీటర్లు మేర రోడ్లు భవనాల శాఖ రహదారులు దెబ్బతిన్నాయ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై ఎంఆర్‌కె రాజు

సేఫ్టీ ఫస్ట్.. హెల్మెట్ మస్ట్

కైకలూరు జూలై 23 : యువత ద్విచక్ర వాహనం నడిపే సమయంలో ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని కైకలూరు టౌన్ ఎస్సై ఎంఆర్‌కె రాజు అన్నారు. మంగళవారం కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో హెల్మెట్ ధారణ పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ఎస్సై మాట్లాడుతూ హెల్మెట్ లేకపోవడం వలనే ఎక్కువ మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారన్నారు. ఈ సందర్భంగా విదార్థులతో సేఫ్టీ ఫస్ట్ హెల్మెట్ మస్ట్ అని నినాదాలు చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె సుజాత, కోఆర్డినేటర్ డాక్టర్ ఎం హరిప్రసాద్, అధ్యాపక బృందం ఎం విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు



ముసునూరు, జూలై 23: సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందకుండా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఈవోపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం లోపూడి, సూరేపల్లి, చెక్కపల్లి తదితర గ్రామాల్లో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో పలుకాలనీల్లో మురుగునీరు, వర్షపునీరు నిల్వలను పారిశుధ్య కార్మికులు తొలిగించి, బ్లీచింగ్ చల్లారు. అలాగే రహదారుల వెంట ఉన్న చెత్తాచెదారాన్ని రిక్షాల ద్వారా గ్రామ శివారుల్లోకి తరలించారు. ప్రతి మంచినీటి సరఫరా ట్యాంక్‌లను ఎప్పటికప్పుడూ క్లోరినేషన్ చేస్తున్నామన్నారు. సర్పంచ్‌లు పేరం కృష్ణ, ముళ్ళపూడి సుధారాణి, తల్లిబోయిన రాధిక తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తొలి విడత అడ్మిషన్ల ప్రక్రియ



నూజివీడు టౌన్, జూలై 23: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో తొలి విడత అడ్మిషన్ల ప్రక్రియ మంగళవారంతో ముగిసింది. జనరల్ కౌన్సిలింగ్‌లో భాగంగా మొదటి రెండ్రోజుల్లో 1050 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపగా 883 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. మొత్తం మీద 167 మంది విద్యార్థులు అడ్మిషన్ల ప్రక్రియకు గైర్హాజరు కాగా నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో మిగిలిన సీట్లకు రెండో దశ కౌన్సెలింగ్ ప్రక్రియను త్వరలో నిర్వహిస్తామని అడ్మిషన్ల కన్వీనర్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో నిర్వహించిన జనరల్ కౌన్సెలింగ్‌లో బాలికలు అత్యధికంగా అడ్మిషన్లు పొందారు. మొత్తం 883 మంది విద్యార్థులలో 578 మంది బాలికలు అడ్మిషన్లు పొందడం విశేషం. కాగా 305 మంది బాలురు అడ్మిషన్లు పొందారు.

ఇద్దరు హాస్టల్ ఉద్యోగుల బదిలీ

ముసునూరు, జూలై 23: ముసునూరు బాలికల వసతి గృహంలో ఇద్దరు ఉద్యోగులను బదిలీ చేశారు. బాలికల రక్షణ, భోజనంపై సిబ్బంది పనితీరు బాగోలేదని బాలికల తల్లిదండ్రులు, స్థానికుల నుంచి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు రావడంతో ఇటీవల నూజివీడు ఆర్డీవో భవానీ శంకరి వసతిగృహాన్ని ఆకస్మిక తనిఖీ చేసి సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆర్డీవో ఆదేశాల మేరకు కుక్, నైట్ వాచ్‌మన్‌ను నూజివీడు ఎస్సీ హాస్టల్‌కు బదిలీ చేసి, అక్కడ పనిచేస్తున్న ఇద్దరిని ముసునూరు హాస్టల్‌కు పంపనున్నట్లు ఎస్‌డబ్ల్యూవో శ్రీనివాసరావు తెలిపారు. అలాగే ఇప్పటివరకు ఈ హాస్టల్‌కు ఇన్‌చార్జ్ వార్డెన్ ఉన్నారని, అవనిగడ్డకు చెందిన హిమబిందు నూతన పోస్టింగ్‌తో ఈ వసతి గృహానికి పర్మినెంట్ వార్డెన్‌గా త్వరలోనే బాధ్యతలు తీసుకుంటారని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు జూలై 23: కైకలూరు మండలం పల్లెవాడ, వరహాపట్నం సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ కె రామకృష్ణ తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తమై సరఫరా నిలిపివేస్తామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్వల్పకాలిక రకాలు ఎంచుకోవాలి

నూజివీడు టౌన్, జూలై 23: వరి నారుమడులు వేయని వారు స్వల్పకాలిక రకాలైన ఎంటీయూ 1010, 1153 వంటి రకాలను సాగు చేసుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి.విద్యాసాగర్ అన్నారు. పోతిరెడ్డిపల్లిలో పొలాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం నారుమడి దశలో ఉన్న చేల్లో అధిక నీరు లేకుండా బయటకు పంపాలన్నారు. ఇప్పటికే నాట్లు పూర్తయిన వాటికి ఎకరానికి 20 కిలోల యూరియా వేసి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. డివిజన్‌లో పత్తి మొక్క దశలో ఉందని వేరుకుళ్ల నివారణకు కాపరాక్సిక్లోరైడ్ పిచికారీ చేయాలని సూచించారు. ఏవో ఎ.చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నూజివీడు టౌన్, జూలై 23: నూజివీడు మండలంలో ఏర్పాటు చేసిన ఆధార్ శిబిరాలను గ్రామీణులు వినియోగించుకోవాలని ఎంపీడీవో కిరణ్‌కుమార్ అన్నారు. యనమదల, బత్తులవారిగూడెం సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్లను ఆయన మంగళవారం పరిశీలించారు. ఆధార్ అప్‌డేట్ తదితర సేవలను గ్రామస్తులు వినియోగించుకోవాలన్నారు.

చాట్రాయి: చాట్రాయి, చనుబండ గ్రామ సచివాలయాలలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక ఆధార్ క్యాంపులకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. 5 సంవత్సరాల లోపు పిల్లలకు నూతన ఆధార్ ఎన్రోల్‌మెంట్, పెద్ద వాళ్ళ ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్స్, ఆధార్‌కు ఫోన్ నెంబరు లింక్ మొదలైన వాటి కొరకు అధిక సంఖ్యలో జనం ఆధార్ క్యాంపులకు వచ్చారు. అంగన్వాడీ కార్యకర్తలు తమ పరిధిలోని పిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక ఆధార్ క్యాంపుల గురించి తెలియజేసి సచివాలయాలకు తీసుకువచ్చారు.

కలిదిండి: కలిదిండి పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ శిబిరాన్ని ఎంపీడీవో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన రుసుం మాత్రమే తీసుకోవాలని, అధిక రుసుం వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'సీడ్'తో ఉచిత విద్య



నూజివీడు టౌన్, జూలై 23: సీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు సాంకేతిక విద్య అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సయ్యద్ మజార్ హుస్సేని తెలిపారు. బోర్వంచలో ఆయన అయిన్ పాఠశాలలో మాట్లాడుతూ సంస్థ ద్వారా ఆరోగ్య సేవలు, అత్యవసర సహాయ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు విద్యా సంబంధ కార్యక్రమాలకు ప్రతి ఏటా రూ.5 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. దేశ వ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోందన్నారు. కేజీ నుంచి పీజీ వరకు రాణిస్తున్న పేద విద్యార్థులకు కులమతాలకతీతంగా ఉపకార వేతనం అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల యాజమాన్య సభ్యులు అనిస్ ఖాద్రి, సదా ఖాద్రి, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

నరసాపురం ఎంపీడీవో మృతికి సంతాపం



ఆగిరిపల్లి, జూలై 23: అదృశ్యమైన నరసాపురం ఎంపీడీవో వెంకట రమణారావు ఏలూరు కాల్వలో విగతజీవిగా లభ్యమవడం బాధా కరమని ఆగిరిపల్లి మండల పరిషత్ సిబ్బంది, ఎంపీడీవో శామ్యూల్, సూపరింటెండెంట్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, ఆ కుటుంబానికి భగవంతుడు ఆత్మస్థైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి గ్యాస్ పొయ్యి వితరణ



ముసునూరు, జూలై 23: కొర్లకుంట అంగన్‌వాడీ కేంద్రానికి టీడీపీ నాయకుడు పొల్నూరి మహేంద్ర వర్మ, లక్ష్మీప్రసన్న దంపతులు మంగళవారం గ్యాస్ పొయ్యిని అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యల పరిష్కారానికి తమవంతు కృషిచేస్తామని ఆయన తెలిపారు. జనసేన నాయకులు యాదాల శివ, టీడీపీ నాయకులు గూడపాటి సుబ్బారావు, ముసునూరు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

శిక్షా సప్తాహ్

చాట్రాయి, జూలై 23: జాతీయ విద్యా విధాన సంస్కరణలలో భాగంగా విద్యాశాఖ ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని అన్ని పాఠశాలలో విద్యార్థులకు పునాది అభ్యాసన, సంఖ్యా శాస్త్రం, నైపుణాల అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. ఎంఈవో వీయస్వీ బ్రహ్మచారి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.